అక్రమ అరెస్టులపై ఎమ్మార్పీఎస్ ఖండన



నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన విద్య కోసం ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న 900 ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రొఫెసర్ కాసిం దీక్ష చేస్తుంటే ఆ దీక్షకు మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఎమ్మార్పీఎస్ టీఎస్ నంగునూరు మండల అధ్యక్షులు కందికట్ల రాజు మాదిగ తీవ్రంగా ఖండించారు. ప్రొఫెసర్ కాసిం న్యాయమైన డిమాండ్డైనందున ఇరువురిని అరెస్టు చేయడం అక్రమ అరెస్టుగా భావిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలు పిరికి వాళ్ళ చర్యగా భావిస్తూ మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఓయూ పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలోఎంఎస్పీ సీనియర్ నాయకులు ఆరెపల్లి కనకయ్య, మండల నాయకుడు బంగారు నర్సింలు పాల్గొన్నారు.

నవతెలంగాణ 1



మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం 9 ఫిబ్రవరి 2023

హైనా దాడిలో గేదెదూడ మృతి



నవతెలంగాణ-మర్కుక్

హైనా దాడిలో గేదెదూడ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని భావానందపూర్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన రైతు కుమ్మరిస్వామి రోజువారీ లాగే పశువుల పాక వద్ద పశువులను రాత్రి కట్టేసి ఇంటికి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున పశువుల పాక వద్ద వచ్చి చూసేసరికి గేదె దూడ రక్తపు మడుగులో కనిపించింది. రైతు ఈ విషయమై పశువైద్యాదికారికి, అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. పశువైద్యాధికారి, అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి వెళ్లక పోవడం గమనార్హం. ఇటీవల మూడు రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన చింతకాయల విఠల్ లేగ దూడను హైనా దాడి చేసి చంపేసిందని గ్రామస్తులు తెలిపారు.

విద్యుత్ కోతలపై.. అన్నదాతల కన్నెర్ర

- కరెంటు కోతలతో ఇబ్బంది పడుతున్నామని ఆందోళన
- రోడ్డుపై ట్రాక్టర్ నిలిపి రాస్తారోకో
- రోడ్డుపై బైఠాయించి రైతుల నిరసన
- విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి అధికారులు వెళ్లకుండా అడ్డగింత





నవతెలంగాణ-నంగునూరు

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పడమే తప్ప రైతులకు చేసిందేమీలేదని రైతులు ఆరోపించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సరిపడా రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం నంగునూరు మండలం సిద్దిపేట-హన్మకొండ రహదారి ముండ్రాయి గ్రామ స్టేజ్ వద్ద రైతులు ట్రాక్టర్‌ను రోడ్డుపై అడ్డంగా నిలిపి రాస్తారోకో చేశారు. ఖానాపూర్, అంక్షాపూర్, నాగరాజుపల్లి మూడు గ్రామాలకు గత మూడు రోజుల నుంచి వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా రావడం లేదని మండిపడ్డారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా విషయంపై అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆవేశంతో ట్రాక్టర్‌ను రోడ్డుపై అడ్డంగా నిలిపి నిరసన తెలిపారు. ప్రభుత్వం 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ప్రచారం చేయడమే తప్ప 12 గంటలు కూడా రావడం లేదని ఆరోపించారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బడ్జెట్ సమావేశంలో 24 గంటల కరెంటు ఇస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రైతులు రాస్తారోకో చేయడంతో రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి రాజగోపాల్ పేట పోలీసులు చేరుకొని రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

నాణ్యమైన విద్యుత్ అందించడం లేదని సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

నవతెలంగాణ-కోహెడ : మండలంలో వ్యవసాయ పనులకు వేళాపాల లేని విద్యుత్‌ను ఇవ్వడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తీగలకుంటపల్లి గ్రామస్తులు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుండే తప్ప ఆచరణలో అమలు చేయడంలేదన్నారు. కోహెడ మండలానికి చుట్టుపక్కల అన్ని మండలాలకు కరెంట్ సరఫరా చేస్తున్నారని, ఈ మండలానికి ఎందుకు లేదన్నారు. రానున్న రోజులలో వేసవికాలంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, లేనట్లయితే సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సుమారు రెండు గంటల మేర గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏఈ తెలపడంతో ఆందోళన విరమించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, నాయకులు ధర్నాకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాక్స్ డైరెక్టర్ మ్యాకాల సురేందర్‌రెడ్డి, రైతులు కొమ్మిడి సంజీవరెడ్డి, పులగుర్ల రాజిరెడ్డి, మెతుకు శేఖర్‌రెడ్డి, మెతుకు ప్రశాంత్‌రెడ్డి, యాటల ఎల్లయ్య, మూల రాజిరెడ్డి, బాల్ రెడ్డి, గుడిపల్లి వేణు, మంద బీరయ్య, పెరుగు సంజీవరెడ్డి, చల్లా తిరుపతిరెడ్డి, ఇట్టిరెడ్డి తిరుపతిరెడ్డి, తడకల సంజీవరెడ్డి, తడకల రాజగోపాల్‌రెడ్డి, ఇట్టిరెడ్డి రాజిరెడ్డి, వట్టిపల్లి హనుమంతరెడ్డి, దాశెట్టి వాసిరెడ్డి, మూల రాజిరెడ్డి, మూల లక్ష్మారెడ్డి, జాలిగాం ఎల్లయ్య, ఏర్పుల హరీష్, అఖిల్, మహేందర్, పొన్నాల రవి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ల శ్రీనివాస్, మ్యాకాల రజినీకాంత్ రెడ్డి, చేను తిరుపతి, బండ జగన్ యాదవ్, మండల ఉపాధ్యక్షు బొమ్మగాని శివకుమార్, ఆర్టీఐ సెల్ కన్వీనర్ ముంజ రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు మామిడి కరుణాకర్, కంది సత్యనారాయణ, ముంజ సాగర్, మాదాసు శ్రీనివాస్, మూల రాజిరెడ్డి, కొమ్మిడి సంజీవరెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో ఆంక్షలేంటి?

నవతెలంగాణ-బెజ్జంకి : వ్యవసాయ సాగుకు అధికారులు ఆంక్షలతో విద్యుత్ సరఫరా చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు ఆంక్షలతో కూడిన విద్యుత్ సరఫరా చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండలంలోని తోటపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వీరాపూర్ రైతులు ఆందోళన చేశారు. సబ్‌స్టేషన్ కార్యాలయంలోకి అధికారులు వెళ్లకుండా బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఓ వైపు వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతుంటే.. మరో వైపు అధికారులు ఆంక్షలతో విద్యుత్ సరఫరా చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. రైతుల ఆందోళనపై ఏఈ బాలకిషన్‌ను వివరణ కోరగా సాంకేతిక కారణాల వల్ల ఆంక్షలతో కూడిన విద్యుత్ సరఫరా చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో తలెత్తున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో రైతులు సహకరించాలని కోరారు.



వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తె మట్టెల పంపిణీ



నవ తెలంగాణ-సిద్దిపేట

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద మానస వివాహం సందర్భంగా నేతి శ్రీనివాస్-తులసిరాని సహకారంతో పుస్తె మట్టెలు, చీర అందించినట్లు వాసవీ క్లబ్ అధ్యక్షులు చింత రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఓ అయిత శంకర్, క్లబ్ గ్రీటింగ్ చైర్మన్ మర్యాల వీరేశం, వాసవి వనితా క్లబ్ అధ్యక్షులు తడుపునూరి కృష్ణవేణి, కార్యదర్శి కొమురవెల్లి కల్పన, క్యాషియర్ తిమ్మిశెట్టి విజయలక్ష్మి, వాసవి యూత్ అధ్యక్షుడు అరవపల్లి హరి కిరణ్, రీజియన్ సెక్రెటరీ మంకాళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం



నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ దేవాలయ రెండో వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మాడ బోయిన రాజు మాట్లాడుతూ రెండో వార్షికోత్సవం సందర్భంగా పెద్దమ్మ దేవాలయంలో బుధవారం కుంకుమార్చన, హోమం, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ముదిరాజ్ సంఘ సభ్యులు,పలువురు పాల్గొన్నారు.

నూతన బీఆర్ఎస్ గ్రామశాఖాధ్యక్షుల నియామకం

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని తోటపల్లి, పోతారం గ్రామాలకు చెందిన కవ్వంపల్లి లక్ష్మన్, పుట్ట సంపత్‌లను నూతన బీఆర్ఎస్ గ్రామశాఖాధ్యక్షులుగా నియమించినట్టు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి బుధవారం తెలిపారు. మండల కేంద్రంలో నూతన అధ్యక్షులకు నియామకపత్రాలను మహిపాల్‌రెడ్డి అందజేశారు. బీఆర్ఎస్ అనుబంధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ దుబ్బాక రూరల్

అక్బరుపేట్ మండల పరిధిలోని చిట్టాపూర్ ఏఈగా కనకయ్య పదోన్నతి లభించింది. బుధవారం చిట్టాపూర్ విద్యుత్ సెక్షన్ ఆఫీస్‌లో టీఎస్యుఈఈయూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఏఈని శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఎస్. చంద్రారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ నారాయణరెడ్డి ,డివిజన్ ఉపాధ్యక్షుడు ఎ రవి, డివిజన్ నాయకులు ఎస్. స్వామి, జి. శేఖర్ రెడ్డి జి చంద్రారెడ్డి రాములు, మైసయ్య, నరేష్ పాల్గొన్నారు

విద్యార్థికి పథమ బహుమతి



నవ తెలంగాణ-దౌల్తాబాద్

జిల్లా కేంద్రమైన సిద్దిపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి హిందీ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల ముబారస్‌పూర్ విద్యార్థిని అజ్మత్ ఉన్నిసాకు జిల్లా స్థాయి ప్రథమ బహుమతి లభించింది. ఈ బహుమతిని జిల్లా విద్యాధికారి చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు జరీనా సుల్తానా, మండల ఉపాధ్యాయులు విజయ కృష్ణ అభినందించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనిస్తేటిస్ట్ 1, డాటా ఎంట్రీ ఆపరేటర్ 1, మెడికల్ ఆఫీసర్ 1, మెడికల్ ఆఫీసర్ పిడియాట్రీషన్ 1, ఫిజియోథెరపిస్ట్ 1 పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్టు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు రేపటి(శుక్రవారం) లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలను sangareddy.telangana.gov.inసైట్‌లో పెట్టినట్టు తెలిపారు. అర్హులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

క్రీడారంగానికి సముచిత స్థానం



నవ తెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో క్రీడారంగానికి సముచిత స్థానం కల్పించిందని సిమ్మింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండి ప్రవీణ్ తెలిపారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం క్రీడలకు రూ.53 కోట్లు అదనంగా కేటాయించారన్నారు. ప్రభుత్వం క్రీడారంగానికి చేయూతనిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ విద్యార్థులు రాణించేందుకు దోహదపడుతుందన్నారు. క్రీడా రంగానికి అధిక నిధులు కేటాయించడంపై సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, స్పోర్ట్స్ అథారిటీ స్టేట్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా



నవతెలంగాణ-కొండపాక

'గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. వారికి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి' అని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం పంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ఆధ్వర్యంలో కలెక్టరు కార్యాలయ ఏఓ మహమ్మద్ రహ్మాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులను చాలీచాలని వేతనాలు ఇస్తూ వెట్టి చాకిరీ చేయిస్తున్నారని అన్నారు. పెరిగిన ధరలతో చూస్తే ఒక కుటుంబం బతకాలంటే కనీసం రూ.26 వేల వేతనం అవసరమని, రూ.8,500 ఇస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ కార్మికులను రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ.15,600, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500, డ్రైవర్లకు రూ.22,750 వేతనాలు పెంచాలని కోరారు. జీవో నెంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హులైన కార్మికులందరికీ దళితబంధుతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్మికులకు దుస్తువులు, సబ్బులు, నూనెలు ఇతర వస్తువులు, పనిముట్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర జిల్లాలలో కార్మికులకు రావాల్సిన హక్కులపై సర్క్యులర్ ఇచ్చినప్పటికీ మన జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు గ్రామపంచాయతీ కార్మికులకు రావాల్సిన హక్కుల సర్క్యులర్ జారీ చేయకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2023 జనాభా లెక్క ప్రకారం కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12 నుంచి జనగామ జిల్లా పాలకుర్తి నుంచి ఫిబ్రవరి 28 వరకు 17 రోజులు 300 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. పాదయాత్ర జయప్రదానికి కార్మికులు,శ్రేయోభిలాషులు సహాయ సహకారాలు అందించాలన్నారు. 28న జరిగే ముగింపు సభకు గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

లీఫార్మా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంగానే ఖాజీపల్లిలోని లీఫార్మ కంపెనీలో ప్రమాదం జరిగిందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య ఆరోపించారు. ఈ మేరకు బుధవారం కంపెనీ ఎదుట కార్యకర్తలతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందన్నారు. అంతే కాకుండా ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడితే.. ఎవ్వరూ గాయపడలేదని అబద్ధం చెప్పడం దుర్మార్గమన్నారు. ఉదయం పూట వర్కర్లు ఒక కార్మికుడిని అంబులెన్స్‌లో తరలిస్తుంటే ప్రత్యక్షంగా చూసిన వాళ్లు కూడా ఉన్నారన్నారు. నిర్లక్ష్యంగా వ్యహరించడమే కాకుండా.. అబద్ధం చెబుతున్న యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులను అన్ని రకాలుగా ఆదుకోవాలని, యాజమాన్యమే వైద్య ఖర్చులు భరించాలని, డ్యూటీకి వచ్చేదాకా వేతనం చెల్లించాలన్నారు. కార్మికులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. యజమాన్యం పరిశ్రమ లోపలికి అనుమతించకపోవడం పట్ల కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షులు రంజిత్‌రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని పాత బస్ స్టాండ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రంజిత్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.19,093 కోట్లు, (6.57 శాతం) మాత్రమే కేటాయించటం దారుణమని, గత సం 7.30 శాతం నిధులను కేటాయించగా ఈ బడ్జెట్ లో తగ్గించడం సరికాదన్నారు. మొత్తం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని బడ్జెట్‌తో విద్యారంగం అభివృద్ధి ఎలా సాధ్యమౌతుందని ప్రశ్నించారు. విద్యను కాషాయ కరణ చేసే నూతన జాతీయ విద్యా విధానం 2020 ను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం లో నేడు ప్రభుత్వ విద్యా రంగం అనేక సమస్యల తో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం కేటాయించిన 17 శాతం తెలంగాణ ప్రభుత్వం 6.57 శాతం కేటాయింపులు చూస్తే వ్యత్యాసం తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు గుండె అరుణ్, సుద్దాల శేఖర్, అరవింద్, యశ్వంత్, రవి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనంలో కంటి వెలుగు శిబిరాలకు విద్యార్థుల తరలింపు

- మంత్రి దృష్టిలో మంచి పేరు తెచ్చుకోవడానికి అధికారుల ఆరాటం
- కంటి వెలుగు విజయవంతం కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులు





నవ తెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకాన్ని ఏ విధంగానైనా విజయవంతం చేయాలని ఉద్దేశంతో పట్టణంలోని మున్సిపల్ అధికారులు తీసుకుంటున్న చర్యలు వివాదాస్పదమవుతున్నాయి. పట్టణ ప్రజలు కాకుండా, పట్టణానికి చదువుకోడానికి వస్తున్న వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులను మున్సిపల్ అధికారులు తమ ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనంలో వివిధ కంటి వెలుగు శిబిరాలకు తీసుకువచ్చి వాళ్లను పరీక్షిస్తూ, ఇంతమందికి పరీక్షలు చేయించామని సంఖ్యను పెంచుకుంటున్నారు. స్థానిక మంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు దృష్టిలో కంటి వెలుగు పథకం విజయవంతమైంది. 100 శాతం పూర్తి చేశామని చెప్పుకోవడం కోసమే మున్సిపల్ అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. పట్టణంలోని 43 వార్డులలో కంటి వెలుగు పథకాన్ని వంద రోజులలో పూర్తి చేయాలనే లక్ష్యంతో మున్సిపల్ అధికారులు ప్రణాళికాలు వేసుకొని పనిచేస్తున్నారు. వార్డులో ఉన్న జనాభాను బట్టి సుమారు వారం రోజులపాటు ఆవార్డులలో కంటి వెలుగు పరీక్షలను నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఐదు సెంటర్లలో కంటి వెలుగును నిర్వహిస్తున్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారిని కంటి వెలుగు కేంద్రాలలో పరిశీలించడానికి ప్రభుత్వం అర్హులుగా నిర్ణయించింది. కానీ మంత్రి హరీష్ రావు దృష్టిలో తమకు మంచి పేరు రావాలని, 100 శాతం పూర్తి చేసామని చెప్పుకోవడం కోసం, పట్టణానికి చదువుకోవడానికి వివిధ కళాశాలలకు వస్తున్న విద్యార్థులను, 18 సంవత్సరాలు లోపు వారిని కూడా కంటి వెలుగు కేంద్రాలకు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నారు. మున్సిపల్ అధికారుల చర్యలను ప్రతిపక్షల వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ అధికారులు తమ ఎన్ ఫోర్స్ మెంట్ వాహనంలో విద్యార్థులను కంటి వెలుగు కేంద్రానికి తీసుకొస్తుండగా కాంగ్రెస్ నాయకులు వాహనం ఆపి తమ నిరసన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని కోరుతున్నారు.

ఊపిరి పీల్చుకునేందుకు తల్లడిల్లిన విద్యార్థులు

సిద్దిపేట మున్సిపల్‌కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనంలో చిన్నారులను కంటి వెలుగు కేంద్రాలకు తరలింపుతో ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థులను కుక్కికుక్కి మున్సిపల్ వాహనంలో ఎలా తరలిస్తారు? ప్రభుత్వ అధికారుల పిల్లల్ని కూడా ఇలాగే తరలిస్తారా? కనీసం ఊపిరి కూడా పీల్చుకోవడానికి వీలులేని వాహనంలో ఎందుకు ఎక్కించారు? 18 ఏళ్లలకు పైబడినవారు కంటి వెలుగుకు అర్హులని ప్రభుత్వం చెబుతుంది. అధికారులు మాత్రం ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థినులను కంటి వెలుగుకు ఎలా తరలిస్తారు.

- అత్తు ఇమామ్, సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మైనార్టీ జిల్లా అధ్యక్షులు మాజహార్ మలిక్

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట 11వ వార్డులో గల పాత ఎంపీపీఎస్ పాఠశాలలో నడుపుతున్న ఓ ప్రైవేటు స్క్రాప్ దుకాణంలో బుధవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. మంటలతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్మేశాయి. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఫైర్ స్టేషన్ కు ఫోన్ ద్వారా సమాచారం అందిందని వెంటనే తమ సిబ్బందితో కలిసి మంటల్ని ఆర్పివేసినట్లు దుబ్బాక ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కె.స్వామి చెప్పారు.లచ్చపేట వార్డుకు చెందిన ఎండి తాజుద్దీన్ గత 8 ఏళ్లుగా ఈ స్క్రాప్ దుకాణాన్ని నడుపుతున్నారు. బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంతో సుమారుగా రూ.1 లక్ష నష్టం కలిగిందని, ప్రభుత్వం తనని ఆదుకోవాలని బాధితుడు తాజుద్దీన్ కోరారు. గతంలో ఇదే పాఠశాల భవనంలో స్వచ్ఛ తెలంగాణ క్రింద మున్సిపల్ ఆధ్వర్యంలో డిఆర్‌సీసీ కేంద్రాన్ని నిర్వహించారు.అయితే చాలా రోజుల కిందటే డిఆర్ సి సి కేంద్రాన్ని ఇక్కడ నుండి తరలించి పదో వార్డులోనున్న ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి తెలిపారు.

నా కష్టం ఏ విద్యార్థికీ రావొద్దనే ఇంపాక్ట్



అట్టడుగు వర్గాల విద్యార్థులకు సరైన గైడెన్స్ కోసమే నా కృషి
వ్యక్తిత్వ వికాస నిపుణులు గంప నాగేశ్వరరావు

నవతెలంగాణ-జహీరాబాద్

సరైన గైడెన్స్ లేకపోవడంతో తాను చిన్నతనంలో అనేక కష్టాలు పడ్డానని.. తన లాంటి కష్టం ఏ విద్యార్థికీ రావొద్దనే ఉద్దేశంతో ఇంపాక్ట్ కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఇంపాక్ట్ సంస్థ మాస్టర్ మోటివేటర్ గంప నాగేశ్వరరావు అన్నారు. జహీరాబాద్ పట్టణంలో రెండ్రోజుల పాటు విద్యార్థులకు ఉచితంగా శిక్షణా తరగతులను బోధించిన అనంతరం నవతెలంగాణతో ఆయన ప్రత్యేక మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన తాను.. చిన్నతనంలో చాలా కష్టాలు ఎదుర్కొన్నట్టు తెలిపారు. సరైన దుస్తులు కూడా లేని స్థితి నుంచి.. నేడు జీవితంలో ఓ ఉన్నత స్థాయిలో స్థిరపడ్డానన్నారు. తనలాగా మారుమూల గ్రామాల్లో ఎంతోమంది విద్యార్థులు వారి వద్ద నైపుణ్యం ఉన్నప్పటికీ సరియైన సరైన గైడెన్స్ లేక వెనుకబడుతున్నారన్నారు. అలాంటి వారి కోసం ఇంపాక్ట్ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందే విద్యార్థులకు తన బందంలోని సభ్యులందరూ ఉచితంగానే బోధిస్తారన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే మొదటి సారిగా జహీరాబాద్ పట్టణంలో రెండ్రోజులపాటు తరగతులను నిర్వహించగా.. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొని మనోధైర్యాన్ని ఇచ్చారన్నారు. జహీరాబాద్ పట్టణంలోని నిర్వాహకుల బృందం ఎంతో పట్టుదలతో పనిచేసి వివిధ కళాశాలన్నింటినీ ఒకే వేదిక మీదికి తీసుకురావడం అభినందనీయమన్నారు. యూట్యూబ్ ద్వారా ఎంతో మందికి శిక్షణతో పాటు ఆంగ్లంలో మాట్లాడేందుకు ప్రత్యేక తరగతులను కూడా బోధిస్తున్నామన్నారు. తరగతులను బోధించేందుకు వివిధ రంగాల్లో నిపుణులు అయినటువంటి 12 మంది అధ్యాపకులు ఇక్కడికి వచ్చి ఉచితంగా తరగతులను బోధించారంటే ఈ విద్యార్థుల విలువను గ్రహించడం జరిగిందన్నారు. మార్కులు తక్కువగా వచ్చాయని, తల్లిదండ్రులు తిట్టారని, సమాజంలో ఎవరో ఏమో అనుకుంటారని, భార్యాభర్తల మధ్య గొడవ పడి కుటుంబ కలహాలతో రకరకాలుగా మానసికంగా దెబ్బతిని.. ఆత్మహత్య చేసుకుందామనుకునే వారు ఒక్కసారి తనకు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. తాను ఈ విధంగా ఇప్పటివరకు 200 మందికి నచ్చజెప్పి ఆత్మహత్య చేసుకోకుండా ఆపగలిగిగానని తెలిపారు. తన మొబైల్ నెంబర్ 24 గంటలు ఓపెన్ చేసి ఉంటుంది తాను ఎప్పుడు కూడా స్విచ్ ఆఫ్ చేయనన్నారు. జహీరాబాద్‌లో నిర్వహించిన తరగతులు తన లక్ష్యానికి దగ్గరగా ఉన్నాయన్నారు. కనుక ఈ విధమైనటువంటి తరగతుల నిర్వహించేందుకు దాతలు ముందుకు వస్తే తాను ఎల్లవేళలా శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. నిర్వాహకులు కనీస సౌకర్యాలు మాత్రమే కల్పించాలి బోధకులకు ఎవ్వరికి కూడా ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని వివిధ సంఘాలకు చెందిన నాయకులు వివిధ కళాశాలల ప్రిన్సిపల్, శ్రీనివాస్ రెడ్డి, మారుతి రావు, కష్ణమాచారి, పెద్ద గుండ్ల నారాయణ, అనంత నవీన్ కుమార్, భాస్కర్ యాదవ్, అంజయ్య ఢిల్లీ వసంత్, భాస్కర్ యాదవ్ లాంటి నిర్వాహకులకు కతజ్ఞతలు తెలియజేశారు.

మంత్రి కృషితో ఆరోగ్యశాఖ దేశంలో మూడోస్థానం



నవ తెలంగాణ - సిద్దిపేట

భారతదేశంలో ప్రజలకు సేవలు అందిస్తున్న రాష్ట్రాలలో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మూడో స్థానంలో నిలిచింద, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా హరీశ్ రావు ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా 41వ వార్డ్ కౌన్సిలర్ సాయన్న గారి సుందర్ సిద్దిపేట ప్రజల పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. హరీశ్‌రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉండడంతో సిద్దిపేటకు మెడికల్ కళాశాల వచ్చిందని, ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల సౌకర్యాలు అందుతున్నాయని అన్నారు.



పీజీ కళాశాల అభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట ఓయూ పీజీ కాలేజ్ అభివృద్ధికి కృషి చేయాలని బీఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య కోరారు. బుధవారం అసెంబ్లీలో మర్యాద పూర్వకంగా కలిసి స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కళాశాల నిర్మాణానికి కేటాయించిన నాలుగు ఎకరాల స్థలంలో కొత్త కళాశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయాలని కోరారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 20 కోట్లు ఇదివరకే మంజూరు చేసిందని, పనులు ముందుకి సాగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఆలయ ఆవరణలో షెడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

నవతెలంగాణ-పటాన్‌చెరు

అమీన్పూర్ బీరంగూడ గుట్టపై ఉన్న శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం కోసం రూ.5 లక్షలు విరాళం అందజేసినట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపా రు. ఈ మేరకు బుధవారం చిట్కుల్‌లోని ఆయన నివా సంలో శివ స్వాములకు చెక్కును అందజేశారు. ఈ సంద ర్భంగా మధు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దేవా లయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల సంపూర్ణ అభివృద్ధికి సహకరి స్తుందని, ఉడతా భక్తిగా తన వంతు సాయం చేస్తున్నా నన్నారు. మహాశివరాత్రికి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి వస్తారని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కృషి చేయాలన్నారు. శివ స్వాములు మాజీ ఎంపీటీసీ అనిల్, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





భగీరథ కార్మికులకు చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

మిషన్ భగీరథ కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించడం తోపాటు.. వారికి చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సీఐటీయూ ఆఫీస్‌లో బుధవారం మిషన్ భగీరథ కార్మికుల యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాయిలు పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఇంటికి మంజీరా నీటిని సరఫరా చేస్తున్నా కార్మికులకు మాత్రం కనీస వేతనాలు అందట్లేదన్నారు. చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయకుండా కాంట్రాక్టర్లు శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు బకాయిల ఉన్నాయని.. ఇలాగైతే వారు ఎలా బతుకుతారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ దగ్గరే మిషన్ భగీరథ డిపార్ట్మెంటు ఉన్నప్పటికీ.. కార్మికుల వేతనాలు, సౌకర్యాల కోసం ఎందుకు ఆలోచించడం లేదన్నారు. వేతనాలను రూ.7500 నుండి రూ.10000 వరకే చెల్లిస్తూ చేతులు దులుపేసుకుంటు న్నారన్నారు. అవి కూడా రెగ్యులర్‌గా రాకపోవడంతో కార్మికులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. 4 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. చేయకుంటే జిల్లాలో సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్మికుల జీతాలు, సౌకర్యాల కోసం ఆలోచించకుంటే జిల్లా మొత్తం మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటిని బంద్ చేస్తామన్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని లేని యెడల జరిగే పరిణామాలకు మిషన్ భగీరథ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, రాములు, నాయకులు కృష్ణ, ఎస్ రాములు, వెంకటేష్, మల్లేష్, ప్రహల్లాద, రాజు, సుదర్శన్, బిచ్చప్ప, నర్సింలు ప్రభాకర్ పాల్గొన్నారు.



విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రూ.2000, కాస్మోటిక్ చార్జీలు రూ.250లకు, కాలేజ్ హాస్టల్ విద్యార్థులకు ప్యాకెట్ మని రూ.1000కు పెంచాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మెస్ చార్జీలు 7వ తరగతి లోపు రూ.950, 8వ తరగతి నుండి రూ. 1100, కాస్మోటిక్ చార్జీల బాయ్స్ కు రూ.62, గర్ల్స్‌కు రూ.72 ఇస్తున్నారని.. పెరిగిన ధరలకు ఇవి ఏమాత్రం సరిపోవట్లేదన్నారు. కాలేజ్ హాస్టల్ విద్యార్థులకు ప్యాకెట్ మనీ రూ. 500 ఇచ్చారని కానీ ఈ విద్యా సంవత్సరం ఇప్పటివరకు ప్యాకెట్ మనీ ఇవ్వలే దన్నారు. ఈ ప్యాకెట్ మనీ రూ.1000కి పెంచాలన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అధికారులు ప్రభు త్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామని ప్రకటనలు చేస్తు న్నా.. ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. ఈ అసెంబ్లీ సమావేశంలోనే మెస్, కాస్మోటిక్ చార్జీలు, ప్యాకెట్ మనీ పెం చుతూ జీవో కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు .లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చ రించారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ,జిల్లా కమిటీ సభ్యులు దాస్, దత్తు తదితరులు పాల్గొన్నారు.



పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి

నవతెలంగాణ-సదాశివాపేట

సదాశివపేట పట్టణంలో ఉన్న పేదలందరికీ సిద్దాపూర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని, డబల్ బెడ్ రూమ్ ఎంపికలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నేడు తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలందరూ పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఐటీయూ ఆఫీస్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. నిరుపేదలు ఏండ్ల నుంచి కిరాయి ఇండ్లల్లో ఉండి దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దాపూర్ కాలనీలో ఇండ్ల స్థలాల కోసం రైతుల దగ్గరి నుంచి ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి ఏండ్లు గడుస్తున్నా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదన్నారు. పట్టణంలో గతంలో 5300 మందికి ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయడం చేశారన్నారు. కానీ ఇంతవరకు స్థలం చూపించలేదన్నారు. తక్షణమే వారందరికీ ఇండ్ల స్థలం చూయించాలని డిమాండ్ చేశారు. అలాగే డబుల్ బెడ్ రూమ్ ఎంపికలో ఎక్కువమంది ఇండ్లు ఉన్నవారే ఉన్నారని.. వారి పేర్లను వెంటనే తొలగించి నిజమైన ఇండ్లు ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం నేడు జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు ఏ నర్సింలు, బొబ్బిలి రాజయ్య ఎన్.మల్లేశం, శ్రీనివాస్, జి.శ్రీనివాస్, భూషణం తదితరులు పాల్గొన్నారు.



గంగారంలో కంటి వెలుగు

నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని గంగారం గ్రామంలో రెండో విడతలో భాగంగా బుధవారం సర్పంచ్ నర్సింలు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. అనంతరం కంటి అద్దాలను పంపిణీ చేశారు. గ్రామంలో వారం రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ కాంతయ్య, ఉపసర్పంచ్ మైబు హుస్సేన్, గ్రామ పెద్దలు నరసింహా రెడ్డి, ప్రభు స్వామి, అంజయ్య, వీరారెడ్డి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు

ఈనెల 28లోగా వందశాతం పన్ను వసూళ్లు కావాలి

- జిల్లా కలెక్టర్ శరత్
- సంబంధిత అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 28లోగా వంద శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీలు, డీఎల్పీఓలు, ఎంపీ ఓలు, ఎంపీడీవోలు, ఏపీవోలు, పంచాయతీ సెక్రెటరీ, తదితరులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ఆక్టివ్ లేబర్లో 50 శాతం లేబర్ మొబ లైజేషన్ చేయాలని స్పష్టం చేశారు. చేసిన పనికి సంబంధించి ప్రాపర్‌గా రికార్డు చేయాలన్నారు. పనిచేసిన దానికి సంబంధిత లేబర్‌లకు పే స్లిప్స్ ఇవ్వాలని సూచించారు. ఈజీఎస్ కింద ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 20 పనులు శల్ఫ్‌లో ఉండాలని, శ్రమ శక్తి సంఘాలతో సమావేశం నిర్వహించి ఆయా పనుల లిస్టును ఇవ్వాలన్నారు. ఫీజిబుల్ వర్క్స్ ఉండాలన్నారు. పలువురు పంచాయతీ సెక్రెటరీల అలసత్వం నిర్లక్ష్య ధోరణిపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తికి జీవించే హక్కు లాగే పని చేసే హక్కు ఉందన్నారు. పని కల్పించాలని అడిగిన వారికి



ఈజీఎస్‌లో 15 రోజుల్లోగా పని కల్పించాలన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేస్తేనే మంచి ఫలితాలు ఉంటాయని సూచించారు. చెత్త అమ్మకంతో గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూరాలన్నారు. ప్లాంటేషన్‌కు రెగ్యులర్‌గా వాటరింగ్ చేయాలని ఆదేశించారు. ట్యాంకర్ ద్వారా వాటరింగ్ చేయడంతో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని, ఆ దిశగా ఎంపీడీవోలు, ఎంపీలు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ట్యాంక్ ద్వారా చెట్లకు నీరు పట్టడం ద్వారా గ్రామపంచాయతీకి ఎంత ఆదాయం వచ్చిందన్న వివరాలు సమర్పించాలని సూచించారు. మొక్కలను సంరక్షించాలని, ప్రత్యేకించి రోడ్ సైడ్ ప్లాంటేషన్ రెవెన్యూ ప్లాంటేషన్ సరిగ్గా ఉండాలన్నారు. మొక్కలను మీరు కాపాడండి మొక్కలు మిమ్మల్ని కాపాడుతాయని హితవు పలికారు. స్మశానవాటికలు, వైకుంఠ రథాలు వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. స్మశానవాటికల చుట్టూ బయోఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, సెగ్రీ గేషన్ జరగాలని, తడి చెత్త కంపోస్ట్ తయారు కావాలని, తడి పొడి చెత్త అమ్మకంతో గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూరాలన్నారు. వచ్చిన ఆదాయంలో పంచాయతీ కార్మికులకు అవసరమైన నూనె, సబ్బులు తదితర వస్తువులతో కిట్ ఇవ్వాలని సూచించారు. ఆసరా పింఛన్లకు అర్హత ఉన్న ఎవరు మిస్ కావద్దని, ఉంటే గుర్తించి వారి దరఖాస్తులను ఈనెల 23 లోగా ఎంపీడీవోలకు పంపాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. ఆయా ప్రతిపాదనలను వెంటనే డీఆర్‌డిఓకు సమర్పించాలని ఎంపీడీవోలకు ఆదేశించారు. పింఛన్లకు సంబంధించి ఎలాంటి పెండింగ్ ఉండరాదన్నారు. నర్సరీలు వందశాతం జర్మినేషన్ కావాలన్నారు. ఎంపీడీవోలు, ఎంపిఓలు ఆయా విషయాలలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, డిఆర్‌డిఓ శ్రీనివాసరావు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య అదనపు పీడీలు, డిఎల్పిఓలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీఎంలు పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న మహిళకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కల్హేర్

నారాయణఖేడ్ నియోజకవర్గం నూతన నిజాంపేట్ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ రహీం భార్య సాహెబున్నిసా బేగం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. కాగా ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించి ధైర్యాన్ని అందించారు. తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఆయన వెంట నిజాంపేట్ సర్పంచ్ జగదీశ్ చారి, కుటుంబ సభ్యులు ఉన్నారు.

మల్లికార్జున స్వామి జాతర ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-అమీన్‌పూర్

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ప్రముఖ శైవ క్షేత్రమైన బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నావని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. జాతర ఏర్పాట్లపై బుధవారం ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యంత పురాతన శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి మహాశివరాత్రి జాతర మహోత్సవాల విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. 16వ తేదీ లోపు అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, చలువ పందిళ్ళు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 24 గంటల పాటు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. గత సంవత్సరం ఐదు లక్షల మంది భక్తులు జాతర ఉత్సవాలకు హాజరయ్యారని, ఈసారి మరింత భక్తుల సంఖ్య పెరగవచ్చన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతో పాటు దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, దేవాలయ కమిటీ చైర్మెన్ తులసి రెడ్డి, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, ఆలయ ఈవో శశిధర్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతలో ఉత్సాహాన్ని నింపిన ఇంపాక్ట్

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలో గత రెండ్రోజులగా సాగిన ఇంపాక్ట్ వ్యక్తిత్వ వికాస తరగతులు.. విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపినాయని సామాజికవేత్త ఢిల్లీ వసంత్, ఇంపాక్ట్ నిర్వాహకులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రాత్రి వరకు కొనసాగిన ఈ కార్యక్రమం ముగింపులో ముఖ్య అతిథులుగా డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, జహీరాబాద్ సిఐ తోట భూపతిలతో కలిసి అనేకమంది విద్యార్థులకు బోధించారు. విద్యార్థులకు పరీక్షల ముందు ఈ విధమైన తరగతులను నిర్వహించడం ఎంతో హర్షించేదగ్గ విషయమన్నారు. ప్రధానంగా ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. పదో తరగతి విద్యార్థులకు కూడా ఈ విధమైన తరగతులు నిర్వహిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. తాము గతంలో జహీరాబాద్ సర్వోముఖ అభివృద్ధికై మహిళలకు, యువత కొరకు ఆర్థిక సాధికారత సదస్సులు నిర్వహించి చైతన్యపరిచమన్నారు. నేటి యువత ఉద్యోగం కోసం, ఉపాధి కోసం ఉన్న ఊరిని కన్నవారిని వదిలి వెళ్ళకుండా 'ఉన్న చోటే ఉపాధి' కల్పించుకోవాలని.. స్థానికంగా ఉన్న వనరులను అవకాశాలను



సద్వినియోగం చేసుకోవాలని ఢిల్లీ వసంత్ పిలుపునిచ్చారు. అందుకుగాను యువత స్టార్టప్ కంపెనీల ద్వారా నూతన టెక్నాలజీతో ఆవిష్కరణలు సృష్టించి స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేయలన్నారు. జహీరాబాద్ యువతకు స్వయం ఉపాధి, స్టార్టప్ కంపెనీ, స్కిల్ డెవలప్మెంట్ ప్రయత్నాలకు గాను తన వంతు సహాయ, సహకరాలు పెద్ద స్థాయిలో అందిస్తానన్నారు. ప్రముఖ యోగా గురువు యోగ విజ్ఞాన కేంద్ర ఫౌండర్ జగన్ గురూజీని ఈ సందర్భంగా నిర్వాహకులతో ఢిల్లీ వసంత్ సన్మానించారు. బృంద సభ్యులు యల్. జనార్ధన్ డిక్కీ, యునస్ ఖాన్, ముదుగొండ శ్రీను, స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాలతో విసిగిపోయే అవిశ్వాసం

- ఎమ్మెల్యే మా నిర్ణయాన్ని ఏకీభవిస్తారు
- కౌన్సిలర్ల ధీమా..

నవతెలంగాణ-జోగిపేట

గత మూడేండ్లుగా ఒంటెద్దు పోకడలు.. ఏకపక్ష నిర్ణయాలతో తాము చాలా ఇబ్బందులకు గురయ్యామని.. అందుకే చైర్మెన్, వైస్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టినట్టు మున్సిపల్ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని చైర్మన్‌కు విన్నవించిన ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. చైర్మెన్ వైఖరీతో మున్సిపల్‌లో ప్రజల నుంచి పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదన్నారు. చైర్మన్ వ్యవహార శైలిపై పలుమార్లు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ దృష్టికి తీసుకువెళ్లినా ఆయనలో మార్పు రాలేదన్నారు. చైర్మెన్ కుటుంబం చేస్తున్న పనులకు వెనువెంటనే బిల్లులు వస్తున్నాయని, తాము చేస్తున్న పనులకు బిల్లులు మాత్రం చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఆరోపించారు. చైర్మెన్‌ను దించడమే తమ ఏకైక లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేకు తమకు మధ్యన బేదాభిప్రాయాలు తీసుకురావ డానికి చైర్మన్ కుట్రలు చేస్తున్నారని, తాము ఎమ్మెల్యేను కలిసి చైర్మెన్‌ను దించేందుకు ఒప్పిస్తామన్నారు. ప్రస్తుతం 12 మంది కౌన్సిలర్లలో 8 మంది బీసీలు ఉన్నారని, వారిలో ఎవరిని



చైర్మెంను చేసినా ఎమ్మెల్యే నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. డబ్బుల కోసమే అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారని అవాస్తవ ప్రకటనలు చేస్తున్నారని, తాము డబ్బులకు ఆశపడి కాదని, పట్టణ అభివృద్ధి కోసమే ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేను కూడా కలిసి తమ అభిప్రాయాలను వ్యక్తపరచామన్నారు. అవిశ్వాస తీర్మానం అంశం ముందుకు రాగానే కౌన్సిలర్ల కుటుంబ సభ్యుల, ఉద్యోగుల మీద ఇబ్బందులకు గురి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కాగా తామంతా బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు భవాని నాగరత్నం గౌడ్, గడిడ్ల భారతి, మాధవి వెంకటేశం, సుమిత్రా సత్యం, భాగ్యలక్ష్మి లక్ష్మణ్, ప్రవీణ సంతోష్, జాకియ సుల్తానా, పైతరగారి దుర్గేష్, కోరబోయిన నాగరాజు, చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాలను సమర్ధించాలా?

నవతెలంగాణ-పటాన్‌చెరు

సమస్యపై అవగాహన లేకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటా శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం వారి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ పటాన్‌చెరు నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పటాన్‌చెరు మండల అధ్యక్షులు పాండు, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ కుమార్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డిలు కాటా వ్యాఖ్యలను ఖండించారు. పటాన్ చెరు మండలం భానూరు గ్రామపంచాయతీ పరిధిలోని పశువైద్యశాలకు సంబంధించిన ప్రహరీని ఇటీవల గ్రామపంచాయతీ సర్పంచ్, కొందరు వార్డు సభ్యులు ప్రభుత్వ అనుమతి లేకుండా ధ్వంసం చేయడంతో పాటు వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తున్నారన్నారు. ఈ అంశంపై సంబంధిత శాఖ అధికారులు పోలీసులకు, సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారన్నారు. విచారణ అనంతరం పనులు నిలిపివేశారన్నారు. కాగా ఇటీవల భానూరు గ్రామంలో పర్యటించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటా శ్రీనివాస్ గౌడ్



గ్రామ సమస్యపై ఎలాంటి అవగాహన లేకుండా అభివృద్ధి పనులు చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారంటూ విమర్శలు చేయడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. గతంలో అమీన్పూర్ సర్పంచ్‌గా పని చేసిన సమయంలో కాటా చేసిన అక్రమాలు, కబ్జాలు, అనుమతి లేని నిర్మాణాల గురించి ప్రతీ ఒక్కరికి తెలుసునని దుయ్యబట్టారు. నిరాధార నిందలు వేయడం మానుకోని.. అభివృద్ధిలో భాగస్వాములు అయితే ప్రజలు హర్షిస్తారే తప్పా.. కబ్జాలు అక్రమ నిర్మాణాలకు వంత పాడితే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, అజ్మత్, సాయినాథ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పీర్ గైబ్ సాహెబ్ దర్గాలో మొక్కు చెల్లించుకున్న వై.నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్

న్యాల్‌కల్ మండల కేంద్రంలో గల పీర్ గైబ్ సాహెబ్ దర్గా ఉత్సవాల సందర్భంగా బుధవారం టీపీసీసీ నాయకులు వై.నరోత్తం దర్గాకు వెళ్లి భక్తితో చాదర్‌ను సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. కాగా నిర్వాహకులు, పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఉత్సవ కమిటీ వారు ఆయన్ను శాలువా, పూలమాలతో సత్కరించారు. మాజీ సర్పంచ్ శంకర్, మహ్మద్ యూసుఫ్, దర్గా కమిటీ అధ్యక్షులు యూనూస్ ఖాన్, సభ్యులు నర్సింలు,



వాహబ్, సయ్యద్ అహ్మద్, జగన్నాథ్, మక్సూద్, శివ స్వామి, రాంచందర్, బసయ్య స్వామి, పాండు పాల్గొన్నారు.

జోగిపేట పంచముఖి హనుమాన్ 20వ వార్షికోత్సవం



నవతెలంగాణ-జోగిపేట

జోగుపేట మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయం 20వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయం ముందు హెూమం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జోగిపేట మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య, మాజీ మార్కెట్ చైర్మెన్ మన్నాప్పల్లి మల్లిఖార్జున్ గుప్త, పట్టణ వర్తక సంఘ అధ్యక్షులు రంగ సురేష్, మాజీ ఎంపీపీ రామ గౌడ్, వర్తక సంఘం నాయకులుపాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగం పట్ల నిర్లక్ష్యం

- విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసనలు

నవతెలంగాణ-సంగారెడ్డి, జోగిపేట, జహీరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని.. విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసనలు కార్యక్రమాలు చేపట్టారు. విద్యారంగ అభివృద్ధి గురించి అసెంబ్లీలో ప్రత్యేకంగా చర్చించాలని డిమాండ్ చేశారు.

సంగారెడ్డిలో మాస్టర్ డిగ్రీ కళాశాల నుంచి ఐ.బీ వరకు, ఎస్ఎఫ్ఐ అందోల్ డివిజన్ కమిటీ కమిటీ ఆధ్వర్యంలో జోగిపేటలో ర్యాలీ, రాస్తారోకో.. డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్, జోగిపేటలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్, జహీరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్లో మరోకసారి విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. మొత్తం బడ్జెట్ రూ.2,90396 కోట్లలో విద్యారంగాన్ని కేవలం రూ.19,093 కోట్లు అనగా 6.57శాతానికి మాత్రమే పరిమితం చేయడం దుర్మార్గమన్నారు. వీటిల్లో పాఠశాల విద్యాశాఖకు కేవలం రూ.16,092 కోట్లు



(5.54శాతం) మరియు ఉన్నత విద్యకు 3001 కోట్లు (1శాతం) కేటాయించారన్నారు. మొత్తం బడ్జెట్‌లో కనీసం 10శాతం నిధులు కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యకు రూ.3001 కోట్ల రూపాయలు (1శాతం) మాత్రమే కేటాయించి, దాన్లోంచి 500 కోట్లు విశ్వ విద్యాలయాలలోని మౌలిక వసతుల కల్పన కోసం కేటాయించారన్నారు. తద్వారా ఉన్నత విద్యలో కూడా నామమాత్ర కేటాయింపులేనని అర్థమౌతున్నదన్నారు. బడ్జెట్ లో కేటాయించిన నిధులు యూనివర్సిటీలో ఉన్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా సరిపోదు అన్నారు. మన ఊరు-మనబడి పథకానికి కూడా ప్రత్యేక కేటాయింపులు చేయలేదన్నారు. దీంతో ఈ పథకం అమలకు పూర్తిగా నోచుకోలేదన్నారు. విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ పైన పునః సమీక్ష చేయాలన్నారు. సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాక్షి, కృష్ణా, నాయకులు పాండు, రాజ్ కుమార్,





జోగిపేటలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, శ్రీకాంత్, రాజు, అనిల్, శ్యామల, కల్పన, అఖిల, మానస, విద్యార్థులు, జహీరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యకుడు మల్లేష్, నాయకులు చంద్రవర్ధన్, ఎండి.అలీక్ పాషా, రాజు, నరసింహులు, రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన

నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని సిబ్బితాండా గ్రామానికి చెందిన BCI రైతు డెమో క్షేత్రంలో బుధవారం దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులు క్షేతస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు రైతులకు వేస్ట్ డీకంపోజర్ ద్రావణం తయారీ విధానం గురించి వివరించారు. 200 లీటర్ల నీటిలో 2కిలోల బెల్లం వేసి కలిపి.. 50ఎం.ఎల్ (HELO-CRD) వేస్ట్ డీకంపోజర్‌ను ఇలా మూడు నుంచి ఐదు రోజులు కలపాలన్నారు. ప్లాస్టిక్ డ్రమ్ము, సిమెంట్ గోళాల్లో ఉదయం, సాయంత్రం కలపాలన్నారు. ఇలా మూడు నాలుగు రోజులు కలపడం ద్వారా ద్రావణం తయారవుతుందన్నారు. ద్రావణం పులిసిన తరువాత ఒక తడి నీరు పారించి.. అప్పుడు ద్రావణాన్ని పత్తి కట్టెపై పిచికారీ చేసి రోటవేటర్ వేయాలన్నారు. దీంతో పత్తి కట్టె కుళ్లి ఎరువుగా తయారవుతుందన్నారు. ఇలా చేయడం ద్వారా భూసారం పెరగడంతోపాటు, పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. ఈ ఫీల్డ్ పరిశీలనలో దేశ్ పాండే ఫౌండేషన్ ప్రతినిధులు సాగర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలి

- జీఎంఆర్ వరలక్ష్మి ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అలాగే క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని రాణించాలని జీఎంఆర్ వరలక్ష్మి ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ సూచించారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని కార్యాలయం వద్ద రామాంతాపూర్ తాండాకు చెందిన యువతకు క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని క్రీడల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలను సంపాదించాలని సూచించారు. అలాగే సమాజ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటెడ్ ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, వసంత్ సాయి, ప్రవీణ్, ఫౌండేషన్ ఇంచార్జ్ శ్రీనివాస్‌తో పాటు యువత పాల్గొన్నారు.



చికెన్ ధరలు (కే.జీ)

ఫారంరేటు	- రూ. 93
రిటైల్	- రూ. 115
విత్‌స్కిన్	- రూ. 167
స్కిన్‌లెస్	- రూ. 190

ముదిరాజ్ సంఘానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-పాపన్నపేట



హైకోర్టు సీనియర్ న్యాయవాది, బీజేపీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్ మల్లంపేట ముదిరాజ్ సంఘానికి బుధవారం రూ.2.16లక్షల ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ముదిరాజ్ సంఘం పెద్దలు, గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఆయన గ్రామానికి విచ్చేసి సీతారాముల స్వామిని దర్శించుకున్నారు. ముదిరాజ్ సంఘం పెద్దలు ముదిరాజ్ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరాగా, తన వంతు సహాయంగా రూ.2.16లక్షల ఆర్థికం చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ముదిరాజ్ సంగం ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బైండ్ల సత్యనారాయణ మెదక్ జిల్లా బీజేపీ జనరల్ సెక్రెటరీ, మల్లంపేట గ్రామ సర్పంచ్ బాపు రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, నర్సిములు, సత్యనారాయణ, మెదక్ జిల్లా ఓబీజీ జనరల్ సెక్రటరీ ఆకుల సుధాకర్ , పాపన్నపేట్ బీజేపీ మండల అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి పాల్గొన్నారు.

ఎంపీపీ సర్వసభ్య సమావేశం బహిష్కరణ

నవతెలంగాణ-చిన్నశంకరంపేట



అధికారులు గైరాజార్ కావడంతో మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మెదక్ జిల్లా చిన్న శంకంపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడంతో ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ ఎంపీటీసీలు సమావేశాన్ని బహిస్కరించారు. అనంతరం ఎంపీడీవో ప్రవీణ్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు సమావేశానికి గైరాజర్ కావడంతో సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. వారం రోజులలో తదుపరి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు లేదా సహచరులను సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని తెలియజేశారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి దేవత ప్రతిష్ట మహెూత్సవాలు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారులో లాలు తాండ వద్దా నూతనంగా నిర్మించిన శ్రీరామ నారాయణ క్షేత్రంలో బుధవారం శ్రీ సీతారామచంద్రస్వామి దేవత ప్రతిష్ట మహెూత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్ట్ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి దంపతులు, ఆలయ ధర్మకర్త పి రామ్ చందర్ దంపతుల ఆధ్వర్యంలో మొదటి రోజు గణపతి పూజ, దేవత ఆహ్వానం, అగ్ని ప్రతిష్ట, ప్రత్యేక పూజలతో పాటు విగ్రహాలను ఊరేగించారు. అట్టి విగ్రహాలకు శాయనాది వాసం జలాధివాసం దాన్యాధివాసం వంటి పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు హరికృష్ణ శర్మ, హరి ప్రసాద్ శర్మ, మధు శ్రీ శర్మ, పండితుల బృందంచే వేద మంత్రాల మధ్యన ధ్వజస్తంభ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్ గుప్తా, టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్‌లు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ధరణి హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మెదక్ రూరల్

ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రమేష్ బుధవారం సూచించారు. టెక్నికల్ మాడ్యూల్ 33లో పేర్కొన్న పేరు మార్పు, భూమి స్వభావం, భూమి వర్గీకరణ, భూమి రకం మార్పు, పరిధి దిద్దుబాటు, మిస్సింగ్ అయిన సర్వే నెంబర్, సబ్ డివిజన్ నెంబర్ సరిచేయుట, అన్ని రకాల నేషనల్ ఖాటా నుంచి పట్టాకు భూమిని బదిలీ చేయుట, నాలా నుంచి వ్యవసాయానికి మార్చుట, ధరణి కంటే ముందే గజాలలో అమ్మిన కొంత భూమి వివరాలకు సంబంధించి ధరణిలో సరిచేసుకోవచ్చున్నారు. అలాగే టెక్నికల్ మాడ్యూల్ 15లో పొందుపరచిన మ్యుటేషన్, వారసత్వ, అసైన్డ్ భూముల వివరాలు, పాస్ బుక్‌తో నిమిత్తం లేకుండా నాలాకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలిస్తారని తెలిపారు. అంతేగాక తండ్రి లేదా భర్త పేరు తప్పున్నా, ఆధార్ తప్పున్నా, లింగ బేధం ఉన్నా, తదితర సమస్యలకు సంబంధించి కార్యాలయ పనివేళల్లో ధరణి హెల్ప్ డెస్క్ ద్వారా టెక్నికల్ సిబ్బందికి దరఖాస్తు ఇచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-చేగుంట



ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉమ్మడి చేగుంట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామం ప్రాథమిక కొన్నత పాఠశాలలో బుధవారం సింగిల్ ఫేస్ బోరు మోటర్‌ను ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో మౌలిక వసతుల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్బర్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా నీరు అందించినప్పటికీ పాఠశాలలో అవసర నిమిత్తం సింగిల్ ఫేస్ మోటర్ మండల ప్రజా పరిషత్ నిధుల నుంచి సర్పంచ్, ఎంపీటీసీల కోరిక మేరకు అందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల మౌలిక సదుపాయాల కోసం మన ఊరు, మనబడి కింద నిధులు కేటాయించిందన్నారు. స్థానిక సర్పంచ్ మోహన్ రాథోడ్ ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముఖేష్ గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగయ్యగారు రాజిరెడ్డి, వార్డు సభ్యులు పోచయ్య ఉపాధ్యాయులు హరిరంజన్ శర్మ, నర్సింలు, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

26న దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ



నవతెలంగాణ-సంగారెడ్డి

కలెక్టరేట్ ముందు ఫిబ్రవరి 26వ తేదిన చేపట్టనున్న దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సన్నాహక కార్యక్రమం జిల్లా అధ్యక్షులు నగేష్ కురుమ కోరారు. పట్టణంలోని నాల్గోవ తరగతి భవనంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, అస్తిత్వ నాయకుడు, గొప్ప మహానియుడని కొనియాడారు. కొమురయ్య విగ్రగ్రహ ఆవిష్కరణకు మంత్రి హరీశ్‌రావు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కులా భాందవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జాతీయ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్,, కురుమ సంఘ నాయకులు డాక్టర్ శ్రీహరి, విగ్రహ దాత చేర్యాల ఆంజనేయులు, చేర్యాల రాములు, జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, తాటిపల్లి పాండు, అడ్వకేట్ బాగన్న, అడ్వకేట్ ఖన్నా,గోకుల్ కృష్ణ, కాలువ గడ్డ మల్లయ్య,ఇంజనీర్ రమేష్, అంబారి ఈశ్వరయ్య, రుద్రారం పూర్వ సర్పంచ్ వెంకన్న, లాడే మల్లేశం, పెద్దగొల్ల నగేష్, యూత్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాదినిచ్చే వ్యవసాయ భూములను కోల్పోయాం

- ఇప్పటి వరకు నష్ట పరిహారం ఇవ్వలేదు
- పరిశ్రమల ఏర్పాట్లను అడ్డుకున్న రైతులు



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

వ్యవసాయంతో జీవనోపాదిని పొందే వ్యవసాయ భూములను ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకోసం తీసుకుంది, భూములు తీసుకున్నా ఇప్పటి వరకు నష్ట పరిహారం రాకపోవడంతో అటు జీవనోపాదిని కోల్పోవడంతో పాటు నష్ట పరిహారం రాక కూలీ పనులు చేసుకుని జీవించే పరిస్థితి నెలకొందని వెంటనే తమకు నష్ట పరిహారం చెక్కులను అందజేయాలంటూ రైతులు పరిశ్రమల ఏర్పాట్ల పనులను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సంఘటన మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో బుదవారం ఉదయం జరిగింది. మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకై టీఎస్ఐఐసీ ద్వార సుమారు 190 ఎకరాల భూమిని రైతుల నుంచి తీసుకుంది. దాంతో అందులో కొంత మంది రైతులకు నష్ట పరిహారం చెక్కులు ఇవ్వగా మరి కొంత మంది రైతులకు నష్ట పరిహారం చెక్కులు ఇవ్వలేదు. దాంతో గత రెండు సంవత్సరాలుగా నష్ట పరిహారం చెక్కుల కోసం తహశీల్దార్ కార్యాలయంతో పాటు ఆర్డీవో కార్యాలం చుట్టూ తిరగినప్పటికి నష్ట పరిహారం చెక్కులు అందలేదు. దాంతో బుధవారం ఉదయం గ్రామ ఉపసర్పంచ్ నూకల వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నష్ట పరిహారం రాని 20 మంది రైతులు గ్రామస్థులతో కలిసి పరిశ్రమలకు వెల్లే రోడ్డుపై ధర్నా చేపట్టి పనులను అడ్డుకున్నారు. వెంటనే తమకు నష్ట పరిహారం చెక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంపై జీవనోపాదిని పొందే తమ భూములను తీసుకుని నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో తాము కూలీపనులు చేసుకుని జీవించే పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే తమకు నష్ట పరిహారం చెక్కులను అందజేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూకల రాముయాదవ్, నవీన్‌లతో పాటు రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పనులను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-మెదక్ రూరల్



మన ఊరు మన బడి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి మన ఊరు మన బడి క్రింద చేపట్టిన పనులను మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ మండలాలలో 5 పాఠశాలలలోపు పనులున్న వాటిని నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. ఆపై ఉన్న పాఠశాలల నిర్మాణ పనులను ఏప్రిల్ నాటికి పూర్తిచేసేలా నెల వారీగా కార్యాచరణ రూపొందించి నివేదిక ఇవ్వాలని ఏజెన్సీలకు సూచించారు. నిధుల కొరత లేదని చేసిన పనికి ఎప్పటికప్పుడు ఎం.బి. రికార్డు చేసి ఎఫ్.టి.ఓ. పోర్టల్ లో వివరాలు నమోదు చేసి కలెక్టర్ లాగిన్‌కు పంపాలని ఆదేశించారు. ముందుగా వేసిన అంచానా, పరిపాలన ఆమోదం మేరకు పాఠశాలలో ఏమేమి కాంపోనెంట్ పనులు చేయాలో పాఠశాల మేనేజిమెంట్ కమిటీకి తెలిపి అవగాహన కలిగించి, డబ్బులు కూడా వెంటనే వస్తాయని వారిలో విశ్వాసం కల్గించి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. అదనపు తరగతి గదులు మంజూరైన ప్రాంతాల్లో వెంటనే పనులు ప్రారంభించాలని, ఇంకా ప్రారంభం కానీ ప్రాంతాలలో వెంటనే పనులు చేపట్టాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పరిపాలనా ఆమోదం, ఎఫ్.టి.ఓ. పోర్టల్ లో వివరాల నమోదు పెండింగ్ లేకుండా చూడాలని, సాంకేతిక సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖాధికారికి సూచించారు. పట్టణ ప్రాంతాలలో రూ.30 లక్షల లోపు చేపట్టిన పనుల వివరాల జాబితా, ఇంకా టెండర్లు పూర్తి కానీ పాఠశాలల జాబితా అందజేయియాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఈఈ సత్యనారాయణ రెడ్డి, నీటిపారుదల ఈఈ శ్రీనివాస్ రావు , ఆర్ అండ్ బి డిప్యూటీ ఈఈ వెంకటేశం, మిషన్ భగీరథ, మండల విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి : లింగ వివక్ష రహిత సమాజాన్ని నిర్మించుకుందామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో హైస్కూల్ ప్రాంగణంలో ఎన్జీవో ఆర్గనైజేషన్ అధికారిని సునీత రాకేష్ ఆధ్వర్యంలో బుధవారం మహిళల పట్ల జరుగుతున్న వివక్షతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునితా లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కల్పించిన చట్టాల గురించి వివరించారు. అన్ని రంగాల్లో ఆదుకొని మహిళలను పురుషులతో సమానంగా సమాజంలో గుర్తింపు తెచ్చే విధంగా ప్రభుత్వాలు ఉన్నాయన్నారు చదువుకోవడానికి ప్రభుత్వం ఎన్నో రకాలుగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఎన్జీవో ఆర్గనైజేషన్ అధికారిని సునీత రాకేష్ మాట్లాడారు. మహిళలకు అండగా మేమున్నామంటూ ఏ ఆపద వచ్చినా తాము ఆదుకుంటామన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బేటి బచావో, బేటి పడావో అనే నినాదంతో నియోజకవర్గంలో 76 ప్రోగ్రాంలు ఇవ్వడం జరిగిందన్నారు ఉన్నత చదువులు చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బ్రహ్మాజీ, సూపర్‌వైజర్ వరలక్ష్మి, స్థానిక సర్పంచ్ భాగ్యలక్ష్మి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ యాదమ్మ, ఎస్ఎంసి చైర్మన్ వెంకటేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, పాఠశాల ఉపాధ్యాయుల బృందం, అంగన్వాడి టీచర్లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలి

- పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలి
- హవేలి ఘనపూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన
- ఎస్.పి రోహిణి ప్రియదర్శిని



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

ప్రతి ఒక్కరు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. హవేలీఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్సై శేఖర్ ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందేలాగా పనిచేసి పోలీస్ శాఖకు, జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వస్తే న్యాయం జరుగుతుందని, చిరునవ్వుతో తమ ఇంటికి వెళ్లాలన్నారు. అప్పుడే పోలీస్ వ్యవస్థపై గౌరవం మరింత పెరుగుతుందన్నారు. ప్రతిరోజు పోలీస్ స్టేషను పరిశుభ్రంగా ఉంచాలని, పోలీస్ స్టేషన్‌లోని వర్టికల్స్ నిర్వహణ, హెచ్‌ఆర్ఎంఎస్, ఆన్‌లైన్ వినియోగించు విధానం, టీఎస్ కోప్స్ ఆన్లైన్లో కేసుల వివరాలు నమోదు చేయు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటిషన్‌ను ఆన్లైన్లో నమోదు చేయాలని, సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్లూ కోట్స్, పెట్రో కార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. డయల్100 కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, ప్రతిరోజు వారిని తనిఖీ చేయాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి వివరించి వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, వాహనాల సంబంధించిన ధ్రువపత్రాలు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఉండి ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో ఇన్సూరెన్స్ వర్తించదన్నారు. ఇన్సూరెన్స్ గడువు ముగియక ముందే దానిని రినివల్ చేయించుకోవాలని సూచించారు. అలాగే ప్రతి వాహనదారుడు అతివేగంగా వాహనాలను నడపవద్దని, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యాన్ని చేరాలన్నారు. మెదక్ డి.ఎస్.పి. సైదులు, మెదక్ రూరల్ సి.ఐ. విజయ్ కుమార్, హవేలి ఘనపూర్ ఎస్.ఐ. శేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూపు తగాదాలు వద్దు పార్టీలు మారం

నవతెలంగాణ-చిన్న శంకంపేట.



కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి సమావేశాలకు తమకు సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండల కేంద్రంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల స్థాయిలో జరుగుతున్న సమావేశాలకు తమకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. టి.మాందాపూర్, గజ్జపల్లిలో పాదయాత్రలో మాకు సమాచారం ఇవ్వలేదని దుయ్యబట్టారు. మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డికు గతంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు నాయకులు మేము పార్టీ మారాలని అనుకుంటున్నారేమో? కానీ మేము కాంగ్రెస్ పార్టీని విడబోమని తేల్చి చెప్పేశారు. రాష్ట్రస్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు తమకు సరియైన సమాచారం అందివ్వడానికి తగు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి గోపాల్ రెడ్డితో పాటు ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు శివకుమార్, మిర్జాపల్లి ఎంపీటీసీ సక్కుబాయి తదితరులు కోరుతున్నారు.

ఘనంగా ప్రారంభమైన భగలాముఖి శక్తి పీఠం ప్రతిష్ట మహెూత్సవాలు

- ప్రతిష్ట మహెూత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు
- భక్తులకు ఇబ్బంది లేకుండా భారీ ఏర్పాట్లు



నవతెలంగాణ-నర్సాపూర్

మండల కేంద్రమైన శివంపేటలో దేశంలోనే తొలిసారిగా నిర్మించిన భగలాముఖి శక్తిపీఠం ప్రతిష్ట మహెూత్సవాలు బుధవారం ఆలయ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్యన ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రతిష్ట మహెూత్సవాల్లో భాగంగా మొదటి రోజు గణపతి పూజ. గోపూజ, నవగ్రహ పూజ, శాంతి హెూమం, జలాధివాసం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి . ఈ ప్రతిష్ట మహెూత్సవాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డిలతోపాటు మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, హైకోర్టు న్యాయవాది శివకుమార్ గౌడ్, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ గుప్తాలు పాల్గొని భగలాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భగలాముఖి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేష్ గుప్తా, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్ గుప్తా, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణా గౌడ్, స్థానిక సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ పద్మా వెంకటేష్, వార్డు సభ్యులు పోచ గౌడ్, కొండల్, సింహం, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

..ఎంపీపీ

నవతెలంగాణ-చేగుంట



తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ఏదో ఒక రూపంలో ఆర్థికపరంగా సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నారని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అన్నారు. చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో బుధవారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ దోరగొల్ల రాములతో కలిసి ప్రారంభించారు. అనంతరం కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలించారు. కంటి వెలుగు మిషన్ పరికరాల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజలకు అండగా ఉండి ఆరోగ్యపరంగా సేవలు అందిస్తున్నారన్నారు. కంటి వెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు నర్సింలు, మాజీ పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి, డాక్టర్లు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణలో భాగమే కార్డన్ సర్చ్

- సరైన ధృవపత్రాలులేని 16 వాహనాల సీజ్
- తూప్రాన్ సీఐ శ్రీధర్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుల బాధ్యత అని, ప్రజలలో ధైర్యం కల్పించేందుకే కార్డన్ సర్చ్ చేపడుతున్నామని తూప్రాన్ సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలంలోని పాలాట గ్రామంలో బుధవారం ఉదయం 6 గంటలకు తూప్రాన్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు కార్డన్ సర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని 52 ఇండ్లను తనిఖీ చేశారు. ఎలాంటి, సరైన ధ్రువ పత్రాలు లేకపోవడంతో 16 మోటర్ సైకిల్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామంలోకి ఎవరైనా అపరిచితులు వస్తే తమకు సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. అలాగే గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దాంతో ఎలాంటి నేరాలు జరిగినా గుర్తించేందుకు వీలుంటుందని సూచించారు. వంద మంది పోలీసులు చేసే పనిని ఒక్క సీసీ కెమెరా చేస్తుందని, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని సూచించారు. దాంతో గ్రామస్థులు ముందుకు వచ్చి లక్ష రూపాయలను ఇవ్వడానికి అంగీకరించి, అప్పటికప్పుడే రూ.32 వేలను అందజేశారు. అలాగే ప్రజా రక్షణలో తాము కూడా అంటూ గ్రామ పంచాయితీ పారిశుద్య కార్మికులు కొత్త లక్ష్మి, సబ్బు రాధలు చెరో ఐదు వందల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని తూప్రాన్ ఎస్ఐ సురేష్‌కుమార్, మనోహరాబాద్ ఎస్ఐ సందీప్‌రెడ్డిలతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

పొల్ట్రీ కోసం చెక్కు అందజేసిన చైర్మన్

నవతెలంగాణ- నిజాంపేట



రామాయంపేట సహకార సంఘం నుంచి సంఘం చైర్మన్ బాదే చంద్రం, సంఘం డైరెక్టర్ సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన మంగలి సిద్ధవ్వకు పౌల్ట్రీ లోన్ క్రింద రూ.18 లక్షల చెక్‌ను అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ రామాయంపేట సహకార సంఘం వివిధ రకాల లోన్‌లను ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే రైతులు తాము తీసుకున్న రుణాలను నిర్ణిత గడువులోగా చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ పుట్టి నర్సింలు, సెక్రటరీ పిట్ల శ్రీనివాస్, కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధి

- కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి
- రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి. రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్‌లు అన్నారు. ఏఐసీసీ పీసీసీ ఆదేశాల మేరకు బుధవారం హాత్ సే హాత్ జోడోయాత్ర కార్యక్రమాన్ని మండల పరిధిలోని తుజాల్‌పూర్, తిరుమలాపూర్ బ్రాహ్మణపల్లి గ్రామాలలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్‌లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందాయన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో కాంగ్రెస్ జెండాలను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, నాయకులు హకీం, రిజ్వాన్, శ్రీనివాస్ రెడ్డి, సురేష్ నాయక్, శ్రీనివాస్ గుప్తా, రియాజ్, చార్ల మణిదీప్, అశోక్, నరసింహారెడ్డి, ఆనంద్ కుమార్, నర్సింలు, రాధాకృష్ణ గౌడ్, నర్సింగ్ రావు, లింగం, మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా శ్రమించాలి



నవతెలంగాణ-దుబ్బాక/దుబ్బాక రూరల్

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు శ్రమించాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఈ రెండు నెలలు కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించాలని అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. దుబ్బాక మండల పరిధిలోని హబ్సిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎంఈఓ జోగు ప్రభుదాస్, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల ఉన్నారు.

బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుంది



నవతెలంగాణ-గజ్వేల్

బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఏడో వార్డులో మన్నే బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నర్సారెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అందుబాటులో ఉంటుందని బాధితులకు భరోసా కల్పించారు. అధైర్య పడకుండా కుటుంబాన్ని ముందుకు తీసుకుపోవాలని బాలయ్య కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు. అంతేకాకుండా ప్రభుత్వం బాధితులను వెంటనే గుర్తించి తగిన ఆర్థిక సాయం అందించేలా చూడాలని ఆయన కోరారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో గజ్వేల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దూరు మల్లారెడ్డి, గజ్వేల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కృపానందం, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహంకాళి చంద్రయ్య తదితరులు ఉన్నారు.

జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కరువైంది



- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న జర్నలిస్టులకు ఆరోగ్యం భద్రత కరువైందని హుస్నాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టు శ్రీనివాసును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఉన్నా ఎక్కడా పని చేయక జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పత్రికా రంగంలో ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కార్పొరేట్ హాస్పిటల్లో కూడా ఉచిత వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. హుస్నాబాద్ సింగిల్ విండో డైరెక్టర్లు బండి కుమార్ కల్లేపల్లి కావ్య వెంకటస్వామి పాల్గొన్నారు.

పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన చెక్కు అందజేత



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఏపీజీవీబీ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ మోహన్ రాజు అన్నారు. గజ్వేల్ తూప్రాన్ రోడ్‌లో ఉన్న ఏపీజీవీబీ మేనేజర్ చేతుల మీదుగా రూ. 2 లక్షల చెక్కును గుంటుకు వెంకటయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మోహన్ రాజు మాట్లాడుతూ నవజ్యోతి మహిళా సంఘం సభ్యురాలు గుంటుకు నరసమ్మ ఇటీవల మరణించారని విచారం వ్యక్తం చేశారు. ఆమె రూ. 436తో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన స్కీం కట్టిందన్నారు. నామినీగా ఉన్న మృతురాలు నర్సమ్మ భర్త వెంకటయ్యకు రూ. 2 లక్షల చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకొని కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. తమ బ్యాంక్‌లో కస్టమర్లకు అనుకూలంగా సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సీఓ సరిత, రీసర్చ్ పర్సన్ పద్మ, లావణ్య, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహ్మదాపూర్‌లో ఉచిత పశు వైద్య శిబిరం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్ గ్రామంలో బుధవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 84 పాడి పశువులకు వైద్యం చేసినట్లు పశుసంవర్ధక శాఖ హుస్నాబాద్ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. 58 పాడి పశువులకు దీర్ఘకాలిక గర్భకోత వ్యాధులకు చికిత్స చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్టల సంపత్, డాక్టర్ విజయ భార్గవ్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు 150 పైగా అయ్యేలా చూడాలి



- జెడ్పీ సీఈఓ రమేష్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కంటి వైద్య శిబిరాలలో రోజుకు 150కి పైగా పరీక్షలు అయ్యేలా చూడాలని జెడ్పీ సీఈవో రమేష్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని జిల్లాల గడ్డ గ్రామంలో కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించారు. గ్రామంలో కంటి వైద్య శిబిరంపై ప్రజలకు అవగాహన కలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కంటి వైద్య శిబిరాన్ని ప్రజలందరికీ ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లకావత్ మానస, సర్పంచ్ లావుడ్య స్వరూప లింగయ్య, ఎంపీడీవో కుమారస్వామి, ఎంపీ ఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆయుధ శిక్షణ



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆయుధ శిక్షణ అనేది ఎంతో ముఖ్యమని బెటాలియన్ నాయబ్ సుబేదార్ మంజిత్ సింగ్ అన్నారు. బుధవారం గజ్వేల్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల హబ్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆయుధ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో భాగంగా క్యాడెట్లకు ఆయుధ కవాతు, మ్యాప్ రీడింగ్, ఆయుధ నిర్మాణాలపై తరగతులు నిర్వహించామన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ పూర్తి చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ శిక్షణలో చాకచక్యంగా టెక్నిక్‌లను తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 90 మంది క్యాడెట్లు, హవల్దార్ నరేన్‌సింగ్, రాకేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ భవాని, తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు



నవతెలంగాణ-కొండపాక

ప్రస్తుతం వరి పంటపై కాండం తొలుచు పురుగు నివారణకు పలు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శిని సూచించారు. బుధవారం కొండపాక మండలం, ఖమ్మం పల్లిలో శ్రీనివాస్ అనే రైతు పొలంలో పంటను పరిశీలించి కాండం తొలుచు పురుగు ఉధృతి తెలుసుకోవడం కోసం లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేశారు. ఈ లింగాకర్షణ బుట్టలో ఉన్న రసాయన పదార్థ వాసనకు పురుగులు బుట్టలో పడతాయన్నారు. దీనివల్ల పురుగు ఉధృతి ఎంత ఉందని తెలుసుకొని మందులు పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణు, ఆత్మ కమిటీ సభ్యులు రాములు రైతులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

- భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం

నవతెలంగాణ-సిద్దిపేట

గత బడ్జెట్‌లోనే భవన నిర్మాణ రంగాల కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇస్తామని ప్రకటించి, ఇప్పటి వరకు ఏ ఒక్క కార్మికునికి ఇండ్లు ఇవ్వలేదని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో కూడా భవన నిర్మాణ రంగాల కార్మికులను మర్చిపోయారన్నారు. రాష్ట్రంలో అత్యధిక మంది కార్మికులు భవన నిర్మాణ రంగాల పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వారిని ఆదుకోవాల్సిన అవశ్యకత ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు. సుమారు 60 లక్షల మంది కార్మికులకు ఇల్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, కార్మికుల పైన చిన్నచూపు చూస్తుందన్నారు.



ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి తోట్ల పరశురాములు, ప్రతినిధులు ప్రశాంత్, రవి, లడ్డు, వెంకటస్వామి, మల్లేశం, కనకయ్య, యాదగిరి, నారాయణ, భూపతి, పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనం బేష్

- మర్కుక్ రైతువేదిక, స్మశానవాటికను సందర్శించిన భారత అటవీ శాఖ అధికారులు

నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ పల్లె ప్రకృతి వనం బాగుందని భారత అటవీశాఖ అధికారుల బృందం సభ్యులు కితాబిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన మర్కుక్ గ్రామంలో బృహత్ పల్లె ప్రకృతి వనం, స్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, రైతు వేదికను గ్రామ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, డీఆర్డీవో పీడీ గోపాల్ రావు, డీఎల్‌పీఓ కిరణ్ , ఎంపీడీవో ప్రవీణ్‌లు భారత అటవీశాఖ అధికారులు విజయరంజన్





సింగ్, షాబ్రోస్ సింగ్ 17 మంది బృందం కు వాటిని చూపుతూ అవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా భారత అటవీశాఖ అధికారులు స్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, రైతు వేదికలను చాలా అందగా, అహ్లాదకరంగా తీర్చిదిద్దారన్నారు. పల్లె ప్రకృతి వనం బాగుందని, ఇందులో పండ్ల మొక్కలను నాటితే ఇంకా బాగుండేదని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సర్పంచ్ చేసిన కృషి ఎనలేనిదని సర్పంచ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.నాగేందర్ రెడ్డి, ఎంపీవో రాజలింగం, ఉపాధి హామీ ఈసీ రాజు, ఆత్మ కమిటి డైరెక్టర్ యవగారి సంతోష్ రెడ్డి, వంటి మామిడి మార్కెట్ డైరెక్టర్ కటకం ప్రవీణ్ చారి, రెడ్డి సంఘం మండలాధ్యక్షులు రాజన్నగారి సుదాకర్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు అజయ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మౌన, స్వప్న, నీలిమా, రాజశేఖర్‌రెడ్డి, టీఏలు స్వామి, సురేష్, నాయకులు సాయిని మహేష్, కిషోర్, నర్సింలు, తదితరులున్నారు.

పల్లె ప్రకృతి వనాలను పరిశీలించిన రాష్ట్ర అటవీ శాఖ అధికారులు



నవతెలంగాణ-ములుగు

ములుగు మండలంలోని క్షీరసాగర్ ములుగు గ్రామపంచాయతీలలో పల్లె ప్రకృతి వనం నర్సరీలను రాష్ట్ర అటవీ శాఖ అధికారులు సందర్శించారు. అడిషనల్ కలెక్టర్ వారికి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు పల్లె ప్రకృతి వనం వైకుంఠధామం అడవుల పెంపకాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ గోపాలరావు ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ కొన్యాల మమతా బాల్ రెడ్డి , సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నేడు నిరసన దీక్ష

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఒక రోజు నిరసన దీక్ష చేస్తామని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా 1వ తేదీ నుంచి బుధవారం వరకు 16 గ్రామాలలో పాదయాత్ర చేశామని తెలిపారు. ఈ పాదయాత్రలో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను తెలుసుకు న్నామన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా సమస్యలు తిష్ట వేశాయన్నారు. అర్హులైన వారికి పెన్షన్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు రాకపోవడం బాధాకరమన్నారు. ప్రజల అవసరాల నిమిత్తం మండలం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేకుండా పోయిందని అన్నారు. స్కూళ్లకు, కళాశాలకు వెళ్లడానికి సైతం రవాణా సౌకర్యం లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో రోడ్ల పరిస్థితి చూస్తే మరీ అధ్వాన్నంగా ఉందన్నారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం గురువారం మండల కేంద్రంలో ఒక రోజు దీక్ష చేపడుతున్నామని తెలిపారు. ఈ దీక్షలో మండల డిక్లరేషన్ ప్రకటిస్తామన్నారు. దీక్షలో మాజీ ఉప ముఖ్య మంత్రి దామోదర రాజనరసింహ పాల్గొననున్నారి తెలిపారు. జిల్లా, నియోజకవర్గ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి, కొంగారి నర్సింలు, విజయపాల్ రెడ్డి, ఫిషర్ మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రేపాక తిరుపతి, మహిపాల్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ దుబ్బాక ఇంచార్జీ బాలమల్లు, రామ స్వామి, భూపాల్ రెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బస్తి దవాఖానాను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-సిద్దిపేట

లింగారెడ్డిపల్లిలో త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బస్తి దవాఖానాను మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు , మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి డా.కాశినాథ్ లు బుధవారం పరిశీలించారు. మెడిసిన్ స్టోర్, డిస్పెన్సరీ రూమ్, ల్యాబ్ రూమ్, ఇమినైజేషన్ గది, వైద్యాధికారి గది, నర్సు గది, టాయిలెట్‌లను పరిశీలించారు. బస్తి దవాఖాన గోడలకు మెడికల్‌కు సంబంధించిన చిత్రాలను వేయాలని, టాయిలెట్ వద్ద ఉన్న మెట్లు ఎత్తుగా ఉన్నందున వృద్ధులు , వయసు పైబడిన వారు ఎక్కటానికి సులువుగా ఉండేలా మెట్లు నిర్మించాలని వారు ఆదేశించారు. బస్తి దవాఖానా చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రం చేయాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. బస్తి దవాఖాన పేరుతో కూడిన బోర్డును పెద్దగా ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. మంత్రి హరీశ్ రావు పట్టణంలో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలన్న ఉద్దేశ్యంతో బస్తి



దవాఖానాలను యుద్ధప్రాతిపదికన పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాయి, అధికారులు శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్ మెట్లు కూల్చుకోకు



- రేవంత్ రెడ్డికి వంటేరు హెచ్చరిక

నవతెలంగాణ-గజ్వేల్

గాంధీభవన్ మెట్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే కూల్చకుండా చూసుకోవాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ మినీ సీఎం క్యాంప్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపు టికెట్లు రాకపోతే గాంధీభవన్ మెట్లను కాంగ్రెస్ వృద్ధులే కూల్చివేస్తారని ఆయన హెచ్చరించారు. 119 నియోజకవర్గాలకు అభ్యర్థులు దొరకని కాంగ్రెస్ పార్టీకి నువ్వు పీసీసీ అధ్యక్షునిగా కొనసాగడం సిగ్గుచేటన్నారు. నక్సలైట్లు ప్రగతి భవన్‌ను కూల్చివేయాలనడం సిగ్గుచేటఅన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతి మెట్లు ప్రగతి భవన్ మెట్లని రేవంత్ రెడ్డి మర్చిపోరాదని ఆయన సూచించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షం చేతకాకనే మోడీ రాజ్యమేలుతున్నారన్నారు. పార్లమెంటు సభ్యుడిగా రేవంత్ రెడ్డి సమావేశంలో కాళేశ్వరం కు జాతీయ హెూదా కోసం ఏనాడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు.పేపర్ టైగర్‌గా మారెందుకు ఇలాంటి వాక్యాలు చేయవద్దన్నారు. ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సీఎం కేసీఆర్ వెంటనే పరిష్కారం చేస్తారన్నారు.

అవకతవకలకు పాల్పడితే సహించేది లేదు

- సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

చౌక ధరల దుకాణాల వద్ద అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ తిరుపతిరెడ్డి హెచ్చరించారు. బుధవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన అధికారి ఆర్య నాయక్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆర్య నాయక్ స్థానంలో దుబ్బాకలో పనిచేస్తున్న తిరుపతి రెడ్డికి మిరుదొడ్డి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు అందజేస్తున్న రేషన్ సరుకులను డీలర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా అందజేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బియ్యం పంపిణీలో ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

సంపూర్ణ అంధత్వ నిర్మూలనే ప్రభుత్వం లక్ష్యం

- మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్.

నవతెలంగాణ -గజ్వేల్

సంపూర్ణ అంధత్వ నిర్మూలనే ప్రభుత్వం లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం బంగ్లా వెంకట పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల



అధ్యక్షుడు, బెండే మధుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌతికంగా చూపు కోల్పోయిన వారికి తిరిగి చూపు ప్రసాదించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ మహెూన్నత లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమమే కంటి వెలుగు అన్నారు. మానవ శరీరంలో అన్నిటి కంటే ప్రధానమని తెలిసి కూడా కంటి చూపు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ శాశ్వతం గా చూపు కోల్పోతున్న లక్షలాది మంది ని చైతన్య పరిచే,ఆదుకోవాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల నుండి కంటి వెలుగు కార్యక్రమం పుట్టుకొచ్చింది అని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ చేస్తున్న కంటి వెలుగు ఉద్యమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాపిరెడ్డి, ఎంపీటీసీ అన్వర్ బేగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింలు, మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, ఉప సర్పంచ్ స్వరూప, గ్రామ పార్టీ అధ్యక్షుడు రవీందర్ గౌడ్, డాక్టర్లు, ఆశావర్కర్లు, నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించిన ఎంపీటీసీ

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని వగపల్లి గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని రేబర్తి, వంగపల్లి గ్రామాల ఎంపీటీసీ కూరెళ్ళ రాజు గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగి భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, ఎంపీఓ కాజా మోహినిద్దీన్, కూరెళ్ళ కిరణ్ కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



నేటి యువత చేతుల్లో దేశ భవిష్యత్

నవతెలంగాణ-మద్దూరు




నేటి యువత చేతుల్లో దేశ భవిష్యత్తు ఉందని మద్దూరు ఎస్సై నారాయణ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం క్రీడా సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్సై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ మంగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. నేటి యువత చేతుల్లో దేశ భవిష్యత్తు ఉందన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. తల్లిదండ్రులు కష్టపడి విద్యార్థులను ఉన్నత చదువుల కోసం కళాశాలలకు పంపిస్తున్నారని వారి కష్టాన్ని విద్యార్థులు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరాజు, అమరేందర్, యాదగిరి, కిరణ్ కుమార్, ఖలేద్, నవీన్ కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, బాల సిద్ధయ్య, స్వాతి, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ గద్దె దించి కాంగ్రెస్‌ను గెలిపిద్దాం



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

బీఆర్ఎస్ గద్దె దించి కాంగ్రెస్‌ను గెలిపిద్దామని కాంగ్రెస్ నాయకులు పూజల హరికృష్ణ, దరిపల్లి చంద్రం, సూర్య వర్మ గంప మహేందర్‌లు అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రలో భాగంగా రాష్ట్రంలో ప్రారంభించిన 'హాత్ సే హాత్' అభియాన్ యాత్ర రెండవ రోజు సిద్దిపేట రూరల్ మండల పరిధిలో పుల్లూరు గ్రామంలో హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాద యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రజల సమస్యలను తెలుసుకుంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల చార్జ్ షీట్ ను, రాహుల్ గాంధీ సందేశాన్ని ఇంటింటికి తిరుగుతూ కరపత్రాల ద్వారా తెలియజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం అధికారంలోకి రావడానికి ప్రజలను మభ్య పెట్టి హామీలు గుప్పిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను గెలిపించుకుందామన్నారు. లక్ష్మి, కలిముద్దీన్, చంద్రశేఖర్, అత్తు ఇమామ్, గారిపల్లి రాములు, గణేష్, బిక్షపతి, రమేష్, కనకయ్య, శివకుమార్, వెంకట్, పాల్గొన్నారు.



తంగడపల్లిలో 27వ వార్షిక మహోత్సవాలు

నవతెలంగాణ-సదాశివాపేట



శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మఠం, శ్రీ గురు గంగాధర మహా స్వామి ఆశ్రమం (తంగడపల్లి) 27వ వార్షిక మహోత్సవము, మరియు శ్రీ గురు గంగాధర మహాస్వామి, శ్రీ కోటి భువనేశ్వరి మాత దేవాలయ శంకుస్థాపన మహోత్సవాల్లో భాగంగా 9 రోజులు నిత్య చండీ హవనములో 5వ రోజు షఠస్థల బ్రహ్మ శ్రీశ్రీశ్రీ శివయోగి శివాచార్య మహా స్వామి సాన్నిధ్యం నిర్వహించారు. చండీ హోమము పాల్గొన్న వీరశైవ సమాజం సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అన్మిశెట్టి జయప్రకాష్, అర్చకులు జంగం మహేష్ స్వామి, జంగం విజయ్ స్వామి, జంగం కేదార్నాథ్ స్వామి, జంగం ఓంకార్ స్వామి, జంగం సతీష్ స్వామి భక్తులు పాల్గొన్నారు.



జీబీవీని సందర్శించిన ఎస్ఎస్ఏ జెడి రాజీవ్

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సర్వ శిక్ష అభియాన్ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం గురించి వాకబు చేశారు. అలాగే మండలంలోని నల్తూరు కొర్లకుంట పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభివృద్ధిపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల సిఆర్పిలు శ్రీనివాస్ రజితలు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులు తనిఖీ

నవతెలంగాణ-జిన్నారం

గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి, వీరన్న గూడెం గ్రామాల్లో బుధవారం ఎంపీడీవో చంద్రశేఖర్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేశారు.

కొత్తపల్లిలో కంటి వెలుగు ప్రారంభం..

గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో స్థానిక ఎంపిటిసి ప్రభాకర్ రెడ్డి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పలువురికి పరీక్షలు నిర్వహించి కళ్ళజోడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

చెక్కు బౌన్స్ కేసు కొట్టివేత



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణానికి చెందిన మొహమ్మద్ అన్సారీ పై గొడ్కే మహేందర్ రూ.8,00,000 చెక్కు బౌన్స్ కేసు సీసీనెంబర్ 433/2016 వేశారు. కాగా ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి అనూష కేసు కొట్టివేస్తూ బుధవారం తుది తీర్పు వెలువరించారు.



మల్లికార్జున స్వామి జాతరకు రూ.15 వేల విరాళం

నవతెలంగాణ-జిన్నారం

గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయం జాతర ఉత్సవాలకు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ రూ.15,000 విరాళాన్ని బుధవారం అందించారు. ఈనెల 12 నుండి16 వరకు జరగబోయే శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలను ఘనంగా చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాట సుధా శ్రీనివాస్ గారితో పాటుగా గ్రామ అధ్యక్షుడు వెంకటేష్, వార్డ్ మెంబెర్ మల్లేష్, భిక్షపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం



నవతెలంగాణ-హత్నూర

బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ సోషల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది చంద్రశేఖర్ ఆరోపించారు. బుధవారం దౌల్తాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ కనబడటం సమంజసం కాదన్నారు. గతంలో ఇచ్చిన హామీలు గాలికి వదిలేయడం ఏమిటని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్ హామీలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క హామీ కూడా నెరవేరలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



వైభవంగా సాగుతున్న ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్‌కల్ మండల కేంద్రంలో గల హజ్రత్ పీర్ గైబ్ సాహెబ్ దర్గా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం జాతర సందర్భంగా దర్గాలో జెడ్పీటీసీ బి. స్వప్న భాస్కర్ ప్రత్యేక ప్రార్ధనలతో చద్దర్ సమర్పించి దర్శించుకున్నారు. కాగా వారిని కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు ముంగి సయ్యద్ షకీల్, శివ స్వామి, సంజుయు, ముస్తఫా, వార్డ్ మెంబర్ బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నందు జన్మదిన వేడుకలు



నవతెలంగాణు-నారాయణఖేడ్

ఖేడ్ మండల చప్టా(కే)కు చెందిన శెరికర్ నందు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నగేష్ షేట్కర్ పాల్గొని నందుతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు తాహిర్ అలీ, ఖేడ్ పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు పటేల్, ఖేడ్ నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు నెహ్రూ నాయక్, మాజీ జెడ్పీటీసీ చందర్ నాయక్, నారాయణరెడ్డి, మారుతి నాయక్ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

నవతెలంగాణ-పటాన్‌చెరు





తెలంగాణ ప్రాంతంలోని గిరిజన/గ్రామీణ పాఠశాల విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానం (సైన్స్)పై అవగాహన ఏర్పరచి, కార్యాచరణ ఆధారిత అభ్యాసం ద్వారా శాస్త్రం పట్ల వారి వైఖరిని మార్చే లక్ష్యంతో వైజ్ఞానిక ప్రదర్శన, క్విజ్ పోటీలను హైదరాబాద్ లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిం చనున్నది. క్రిస్టలోగ్రఫీ సొసైటీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో, విద్యార్థులకు చేరువయ్యే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలం పడమట నరసాపురంలో రేపు(శుక్రవారం) ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్టు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. కార్యాచరణ ఆధారిత అభ్యాసం (యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్) ద్వారా సైన్స్ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి, వారి పై ఖరిలో పరివర్తన తీసుకురావాలనే ఉద్దేశంతో దీనిని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. జూలూరుపాడు మండలం, ఆ చుట్టుపక్కల గిరిజన విద్యార్థులకు సమీకరించి, ప్రముఖ పరిశోధకులు, ఆచార్యులతో సైన్స్ ప్రాముఖ్యతను వివరించడం, సైన్స్ ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేయడం, క్విజ్ పోటీలు, నమూనాల ప్రదర్శన వంటివి నిర్వహి ంచనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆయా పోటీల విజేతలకు నగదు పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలను కూడా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, హైదరా బాద్‌లోని ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ జీవన్ లాల్ లావుడ్యాలు హాజరవుతారని ప్రిన్సిపాల్ వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను ఉచితంగానే నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో రసాయన, భౌతిక, గణిత శాస్త్ర నమూనాలను మాత్రమే ప్రదర్శించడానికి అవకాశం కల్పించనున్నట్టు స్పష్టీకరించారు. మరిన్ని వివరాల కోసం కార్యక్రమ సమన్వయకర్తలు ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల 70136 02236 / డాక్టర్ కటారి 9177712000 / డాక్టర్ ఆర్.బాలాజీరావు 9704864966లను సంప్రదించాలని, లేదా scienceexpo@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలని సూచించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి





నవతెలంగాణ-కల్హేర్

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కల్హేర్ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, ఆత్మ చైర్మన్ రామ్ సింగ్ అన్నారు. మండలంలోని మహాదేవ్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని బుధ వారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న పథకాలు దేశంలో మరే రాష్ట్రంలో లేవన్నారు. అంధత్వాన్ని పూర్తిగా తొలగించాలనే ఉద్దేశంతో కంటివెలుగు కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నూతన నిజాంపేట మండలంలోని బాచేపల్లిలో ఉపాధి హామీ కింద మంజూరైన పది లక్షల రూపాయలతో నిర్మించబోయే సీసీరోడ్డు స్థలమును, పాత మట్టి రోడ్డును పరిశీలించారు. వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షులు పట్లోళ్ల దుర్గారెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ సంగారెడ్డి, సర్పంచులు నాగ్దర్ పాపయ్య, పద్మ బాపూజీ, సిహెచ్ఓ ఏక్నాతం, మండల హెల్త్ సూపర్వైజర్ మాణిక్యం. క్యాంపు మెడికల్ ఆఫీసర్ పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ మండలంలోని రోష్లతాండాలో ఏర్పాటు చేసినకంటి వెలుగు క్యాంపును శిబిరాన్ని ఎంపీడీవో సుజాత. బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో సంపూర్ణ అంధత్వ నివారణ కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతీ ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మం డల వైద్యాధికారులు చౌహాన్, సిహెచ్ఓ గాలన్న, క్యాంపు మెడికల్ ఆఫీసర్ గణేష్ . ఆప్తొమెట్రిస్ట్ ముదాసిర్. హెల్త్ సూపర్వైజర్ శాంతా కుమారి, ఏఎన్ఎంలు సుజాత, శ్రీలత, డీఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కొనసాగుతున్న రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాహుల్ చౌహన్, ఉపసర్పంచ్ రామ్ చందర్ బుధ వారం పరిశీలించారు. క్యాంపు శిబిరాన్ని తనిఖీ చేసి.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వారి కంటి సామర్థ్యాన్ని బట్టి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ కళ్లద్దాలను అందించారు. కంటివేలుగు టీం మెడికల్ ఆఫీసర్ సుశీల్ కుమార్, మండల హెల్త్ సూపర్వైజర్ కిరణ్ సుజాత, హెల్త్ అసిస్టెంట్ జట్ల భాస్కర్, ఏఎన్ఎం ఇంద్రాణి, ఆప్తమెట్రిస్ట్ శ్రీకాంత్, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మేళాసంఘం పాఠశాలలో స్వయం పాలనా దినోత్సవం



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మేళాసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులుగా శ్రీదేవి,అక్షిత, లక్ష్మీ మానస, ఖాతిజ, కార్తీక్, అంబిక వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దశరథ్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వీరన్న, ఉపాధ్యాయులు గోపాల్, రత్నమ్మ మంజువాణి, శ్రీకాంత్, ప్రశాంతి, భుజంగం తదితరులు పాల్గొన్నారు.

కర్ణం రఘుపతి మృతికి పలువురు నివాళులు

నవతెలంగాణ-హవేలి ఘనపూర్

హవేళిఘనాపూర్ మండలం కూచన్ పల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు కర్ణం రామకృష్ణ తండ్రి కరణం రఘుపతి మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొని ఇఫ్కో డైరెక్టర్ యం. దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాలకృష్ణలు బుధవారం కుచాన్ పల్లి గ్రామానికి చేరుకొని రఘుపతి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరి వెంట సర్పంచ్ దేవ గౌడ్, నాయకులు చింతల నర్సింలు, రామకిష్టయ్య, గోపాల కృష్ణ తదితరులు ఉన్నారు



బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ-చేగుంట : చేగుంట మండలం మక్కరాజుపేట గ్రామంలో ఇటీవల మరణించిన ప్రవీణ్ కుమార్, రఘువీర్, మీర్ ముస్తఫా, కుటుంబాలను మంగళవారం చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బాధిత కుటుంబాలను ఆదుకుంటారని, ఎవరూ అధైర్య పడవద్దని, వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్, ఎంపీటీసీ బండి కవిత విశ్వేశ్వర్, ఉప సర్పంచ్ భాగ్య లక్ష్మి శంకర్ గౌడ్, రైతు సమన్వయ సమితి కమిటీ సభ్యులు జింక శ్రీనివాస్, ఇబ్రహీంపూర్ మాజీ పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి, సత్తిరెడ్డి, రవీందర్, శివరాజు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వరి పంట సస్యరక్షణపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలో వరి పంట సాగు చేసుకున్న రైతులకు బుధవారం వ్యవసాయ అధికారిని స్వప్న వ్యవసాయ విస్తీర్ణ అధికారిని వందలతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఈ సీజన్లో ముందుగా వరి నాట్లు వేసుకున్న రైతు పొలాల్లో మోగి పురుగు ఎక్కువగా ఆశించినట్లు, దాంతోపాటు అగ్గి తెగులు కూడా ఉన్నట్లు గమనించారు. అందుకు రైతులందరూ అప్రమత్తమై పంట పొలాల్లో ఎప్పటికప్పుడు నీటిని తీసివేస్తూ ఆరబెట్టి మళ్లీ నీరు పెట్టాలని సూచించారు రైతులు తప్పకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.

విద్యార్థులకు సైన్స్ పరికరాల పంపిణీ

నవతెలంగాణ-జిన్నారం



మండలంలోని వివిధ పాఠశాల విద్యార్థులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ బుధవారం సైన్స్, మొబైల్ ల్యాబ్ పరికరాలను పంపిణీ చేసింది. ఒక్కో యూనిట్‌కు రూ.80 వేల విలువగల పరికరాలను చొప్పున మొత్తం కలిపి రూ.6 లక్షల 50 వేల విలువల గల పరికరాలను ఏడు పాఠశాలకు అందజేశారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువను పెంచుకోవాలన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో మెలకువలను ప్రయోగాత్మకంగా పరిశీలించాలని ఆశయంతో జిన్నారం మండల వ్యాప్తంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సైన్స్ మొబైల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ మేరకు సదరు పరికరాలను జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్, ఉప సర్పంచ్ నవనీతరెడ్డి, రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు, వావిలాల, నల్తూర్, కేజీబీవీ, జిన్నారం, మంగంపేట, కొడకంచి, మాదారం పాఠశాలలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ ఇండ్లు ఇవ్వాలి



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్పూర్ మున్సిపాల్టీలో అర్హులైన పేదలందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమీన్పూర్ మున్సిపాలిటీలోని లింగమయ్య కాలనీ, బీరంగూడ ట్రైలర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లు బీరంగూడలో నిర్మించారన్నారు. వాటన్నింటిని అమీన్పూర్ మున్సిపాల్టీలో నివాసముంటున్న అర్హులైన పేదలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఏండ్లుగా నివాసముంటూ కాంట్రాక్టు కార్మి కులుగా, డ్రైవర్లుగా, హమాలీలాంటి ఉపాధి పనులు చేసుకు ంటూ ఎంతోమంది పేదలున్నారన్నారు. వారందరికీ సొంత ఇల్లు కూడా లేదని.. అలాంటి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలన్నారు. అనేకమార్లు ఇప్పటికే దరఖాస్తులు పెట్టి నఎప్పటికీ పట్టించుకున్న పాపాన పోవట్లేదన్నారు. కావున ఫిబ్రవరి 9 ఇందిరా పార్కులో భారీ బహిరంగ సభ నిర్వహి ంచనున్నట్టు తెలిపారు. ఈ సభకు భారీ ఎత్తున కదిలి రావాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. తుపాకి శ్రీనివాస్, కిరణ్ కుమార్, అనిల్ కుమార్, నిర్మల, భాగ్యమ్మ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా తల్లీకూతురు ఆత్మహత్య

- కొడుకు, కూతురుతో కలిసి బావిలో దూకిన తల్లీ
- మోటారు పైపు దొరకడంతో ప్రాణాలు కాపాడుకున్న కుమారుడు



నవతెలంగాణ-జహీరాబాద్, న్యాల్కల్

కుమారుడు, కూతురుతోపాటు ఓ తల్లీ అనుమానాస్పదంగా బావిలో దూకగా.. కుమారుడు మోటారు పైపును పట్టుకుని ప్రాణాలు దక్కించుకోగా.. తల్లీకూతుళ్లు మృతి చెందారు. ఈ విషాదకర ఘటన న్యాల్కల్ మండలంలోని రామతీర్థ గ్రామంలో బుధవారం జరిగింది. హద్నూర్ ఎస్సై వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రామతీర్థ గ్రామానికి చెందిన మల్లేషం, పుణ్యమ్మ(30) దంపతులు కూలీ పనులు చేస్తుండేవారు. అయితే బుధవారం రోజూ లాగానే మల్లేషం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు కూలీ పనుల కోసం వెళ్లాడు. కాగా సాయంత్రం 4 గంటల సమయంలో గ్రామ సమీపంలోని షంషీర్ వ్యవసాయ బావిలోకి అనుమానాస్పదంగా కుమారుడు రమేష్, కుమార్తె సంగీత(9)తో కలిసి పుణ్యమ్మ దూకింది. రమేష్‌కు మోటారు పైపు దొరకడంతో అతడు ప్రాణాలు కాపాడుకున్నాడు. పుణ్యమ్మ, సంగీతలు నీట మునిగి మృతి చెందారు. గ్రామస్తుల సాయంతో మృతదేహాలను పోలీసులు వెలికి తీసి.. జహీరాబాద్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలిం చారు. కాగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కేసీఆర్ అసమర్థ పాలనతో ప్రజలకు నష్టం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్



నవతెలంగాణ-గజ్వేల్

రాష్ట్రంలో కేసీఆర్ కొనసాగిస్తున్న కుటుంబ, అవినీతి, నియంతృత్వ, అసమర్థ పాలనతో ప్రజలకు నష్టం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో శక్తి కేంద్ర సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పరిపాలన ప్రజలకు విసుగొచ్చిందని, 2023లో ప్రజలు ఇంటికి పంపుతారన్నారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నీళ్ల నిధులు నియామకాల కోసం పోరాడిన తెలంగాణ ప్రజలు కేసీఆర్ చేతిలో మోసపోయారని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను కూడా ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్ గౌడ్, నాయకులు ఎల్లు రాంరెడ్డి, గురువారెడ్డి, పేర్ల శ్రీనివాస్, వెంకటరమణ, కుడిక్యాల రాములు, నందన్ గౌడ్, నందాల శ్రీనివాస్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, ఉప్పల మధుసూదన్, సురేష్, మహేష్, మనోహర్ యాదవ్, కమ్మరి శ్రీనివాస్, రమేష్, శ్రీకాంత్, అశోక్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం గంభీర్పూర్ గ్రామానికి చెందిన రాజమల్లయ్య (40) దుబ్బాక నుంచి స్వగ్రామానికి రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో రోడ్డు సరిగా లేని కారణంగా ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే అక్కడున్న వారు 108 అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రున్ని దుబ్బాక ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రునికి వైద్యులు చికిత్స చేసి ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో 108 సిబ్బంది పైలెట్ స్వామి, భాను తదితరులు ఉన్నారు

ప్రతి ఒక్కరూ కంటి వైద్య పరీక్ష చేసుకోవాలి

ఎంపీపీ లకావత్ మానస



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గ్రామాలలోని ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలలో కంటి పరీక్షలు చేసుకోవాలని హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస అన్నారు. బుధవారం జిల్లాల గడ్డ గ్రామంలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, కార్యదర్శి రాకేష్, వార్డు సభ్యులు వైద్యాధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-సిద్దిపేట

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్ తెలిపారు. భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథి డా.అలీ హాజరవుతున్నారని తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతునికి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని చెంచల్‌చెర్వుపల్లి గ్రామానికి చెందిన విలాసాగరం సంపత్ ఇటీవల మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులను బుధవారం బొమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు రేవోజు రమేష్, పోలింగ్ భూత్ అధ్యక్షుడు పిడిశెట్టి తిరుపతి, మండల కార్యవర్గ సభ్యులు గాజుల వెంకటేశ్వర్లు, గాజుల రవీందర్, కంది సత్యనారాయణ, ఎదులాపురం రాజు, భీంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పిడిశెట్టి సంపతి, రేవోజు శ్రావణ్, దండబోయిన రాజయ్య, లింగంపెల్లి శ్రీను, తిమ్మాపురం శ్రీను, ఎల్లబోయిన అజేయ్, ఎల్లబోయిన శేఖర్, విలాసాగరం ఆంజనేయులు, తదితరులున్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా బండి సతీష్ కుమార్



నవతెలంగాణ-నంగునూరు : నంగునూరు మండల బీజేపీ కార్యవర్గ సమావేశం బుధవారం బద్దిపడగలో నిర్వహించారు. బద్దిపడగకు చెందిన బండి సతీష్ కుమార్‌ను బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు బెదురు కుమారస్వామి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీజేపీ పార్టీని బలోపేతం చేయడానికి తనవంతుగా కష్టపడి పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పజెప్పిన బీజేపీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

నవతెలంగాణ 6
సిద్దిపేట
గురువారం 9 ఫిబ్రవరి 2023





కాశిరెడ్డిపల్లిలో పశు వైద్య శిబిరం

నవతెలంగాణ-మర్కుక్

పాడి రైతులు పశువులను సంరక్షిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని మర్కుక్ జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, ఎంపీటీసీ ఫోరం మర్కుక్ మండలాధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కాశిరెడ్డిపల్లి గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ వారి సంయుక్తంగా మర్కుక్ పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, 25-పశువులకు గర్భని విధారణ పరీక్షలు, 34-పశువులకు సాధారణ చికిత్సలు, 25-దూడలకు నటల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అప్పల స్వరూప మల్లేష్ ,పీఏసీఏస్ డైరెక్టర్ దుబ్బాక యాదగిరి, మర్కుక్ వి ఎల్ వో మధుర, గోపాలమిత్ర సూపర్ వైజర్ భాస్కర్ గౌడ్, గోపాలమిత్రలు రవీందర్, ఆంజనేయులు, కిషన్ తదితరులున్నారు.



కౌలు రైతుకు ఆర్థిక సాయం

నవ తెలంగాణ- దౌల్తాబాద్

గొడుగుపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి వారసుల నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాస్ మూడు సంవత్సరాలుగా కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన రాజిరెడ్డి, వడియారం గ్రామానికి చెందిన జీవన్‌రెడ్డి, విఠల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి కలిసి శ్రీనివాస్ సాగు చేసిన రెండు ఎకరాల ఆముదం పంట, మరో ఎకరం వరి పంటను ట్రాక్టర్లతో ధ్వంసం చేశారు. రైతును బెదిరించడంతో అతనికి గుండెపోటు వచ్చింది. వెంటనే శ్రీనివాస్‌ను గజ్వేల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్ రెడ్డి రైతుకు అండగా నిలిచారు. తక్షణ సాయం కింద అతనికి రూ.50 వేలను జెడ్పీటీసీ రణం జ్యోతి ఎంపీపీ సంధ్య మార్కెట్ కమిటీ చైర్మన్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రణం శ్రీనివాస్ గౌడ్ గొడుగుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి గ్రామ యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాలతో చిన్న పిల్లలకు ఉపయోగం



నవతెలంగాణ-తొగుట

చిన్న పిల్లలకు చదువుపై పట్టు సాధించేందుకు, మెథొక్తి పెంచడానికి పుస్తకాలు ఎంతో ఉపయోగ పడతాయని ఆత్మ కమిటీ డైరెక్టర్ దూలం బైరా గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని గుడికం దుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు రూమ్ టు రెడ్ సంస్థ లైబ్రరీ (పుస్తకాలు) అందించారు. విద్యా ధికారి సత్తు యాదవ రెడ్డి,స్థానిక సర్పంచ్ గంగని గళ్ల మల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలుకు పుస్తకాలు అందించడం వల్ల మంచి విజ్ఞానం పెరుగుతుంద న్నారు.పాఠశాల కు రూమ్ టు లైబ్రరీ అందించడం సంతోషకరమన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు అంజలి దేవి,వెంకట్రామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ మరుపల్లి రమేష్ గౌడ్,మాజీ ఎంపీటీసీ శ్యామల ఎల్లయ్య,ఎస్ఎంసి చైర్మన్ ఉప్పరి రాకేష్, ఉపాధ్యాయ బృందం,పిల్లల తల్లిదండ్రులు,రూమ్ టు రీడ్ కోఆర్డినేటర్ లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల జీవితాల్లో వెలుగులు నింపిన దళితబంధు



శాసనసభలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



నవతెలంగాణ-మెదక్ రూరల్

'ఎస్సీ బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపిన దళితబంధు దళితుల ఎదుగుదల కోసమే అని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. 2014కు ముందు తెలంగాణ దుర్భరమైన పరిస్థితుల్లో ఉండేదని చెప్పారు. ఎనిమిదిన్నరేండ్లలో రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. సంక్షేమ రంగాల్లో దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపారని పేర్కొన్నారు. కరోనా సంక్షోభంలోనూ తెలంగాణ ప్రగతి రథం ఆగలేదని తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనా దక్షతకు ఇది నిదర్శనమన్నారు. శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి బుధవారం మాట్లాడుతూ రైతుబంధు పథకం గతంలో ఏ ప్రభుత్వం చేయని గొప్ప ఆలోచన అన్నారు. అన్నదాతల పట్ల సీఎం కేసీఆర్‌కు ఉన్న ప్రేమకు రైతుబంధు నిదర్శనమన్నారు. ఇంటింటికీ నల్లా ద్వారా మంచినీళ్ళు ఇవ్వకుంటే ఎన్నికల్లో ఓట్లు అడగనని దమ్మున్న నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లిచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రాష్ట్రంలోని అన్ని చెరువులు, జలాశయాలు మత్స్య సంపదతో కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. సర్కారు స్కూళ్లను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. కంటివెలుగు అద్భుతమైన కార్యక్రమమన్నారు. రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు ఇవ్వనందుకు కేంద్రం సిగ్గుపడాలని విమర్శించారు. కేంద్రం సహకరించకున్నా సీఎం కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. పల్లెప్రగతి ,పట్టణ ప్రగతితో గ్రామీణ, పట్టణ ప్రాంతాల ముఖచిత్రాలు మారిపోయాయని చెప్పారు. పల్లెప్రగతికి అవార్డులిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, నిధులివ్వడానికి చేతులు మాత్రం రావని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ రంగం ద్వితీయశ్రేణి నగరాలకు కూడా విస్తరిస్తోందంటే ఆ ఘనత కేసీఆర్ సర్కారుదేనని చెప్పారు. ఆర్అండ్‌బీ శాఖలో హౌసింగ్ శాఖను విలీనం చేయడం హర్షణీయమన్నారు.

కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు ఇచ్చిన నిధుల గురించి వివరించాలి



నవతెలంగాణ-చేర్యాల

కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ఇచ్చిన నిధుల గురించి ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జనగామ నియోజకవర్గానికి చెందిన చేర్యాల, మద్దూరు, దూలిమిట్ట, కొమురవెల్లి మండలాల శక్తి కేంద్రాల ఇన్చార్జులు, ఆపై స్థాయి నాయకుల సమావేశం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 25వ తేదీ వరకు ఐదు మండలాలలో ప్రతి శక్తి కేంద్రంలో ప్రజలు గుంపులు గుంపులుగా ఉన్న ప్రదేశాలలో సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదిరెడ్డి అవినీతిని అక్రమాలను భు భాగోతాలను ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయాలన్నారు. బిజెపి సిద్దిపేట,జనగామ జిల్లాల ప్రధాన కార్యదర్శులు బూరుగు సురేష్ గౌడ్,శివరాజ్ యాదవ్, జనగామ నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పోతుగంటి రామదాసు,జిల్లా కార్యదర్శి లక్ష్మీ, జిల్లా అధికార ప్రతినిధి నర్ర మహేందర్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి తోకల ఉమారాణి, రేబర్తి ఎంపిటిసి కూరెల్లి రాజు గౌడ్, ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్ నాయక్, చేర్యాల రూరల్ మండల అధ్యక్షులు కాశెట్టి పాండు పాల్గొన్నారు.

విద్యార్థులను కంటి వెలుగుకు ఎలా తరలిస్తారు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు మాజహర్ మలిక్



నవ తెలంగాణ- సిద్దిపేట

మున్సిపల్ కు చెందిన ఎన్ ఫోర్స్ మెంట్ వాహనంలో చిన్నారులను కంటి వెలుగు కేంద్రాలకు తరలింపుతో ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారని, విద్యార్థులను కంటి వెలుగుకు ఎలా వాహనంలో తరలిస్తారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు మజాహర్ మాలిక్ ప్రశ్నించారు. బుధవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థులను కుక్కి కుక్కి మున్సిపల్ వాహనంలో ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనాన్ని ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించేందుకు ఉపయోగిస్తారని తెలిపారు. అలాంటి వాహనంలో విద్యార్థులను తరలించడం బాధాకరమన్నారు. కంటి వెలుగు కార్యక్రమం 100 శాతం సక్సెస్ చేయాలని ఉద్దేశంతో అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ అతిక్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రషద్, యూత్ కాంగ్రెస్ నాయకులు గయాజుద్దీన్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి





నవ తెలంగాణ -గజ్వేల్

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ప్రగతి భవన్‌ను పేల్చి వేయాలని విద్వేష పూరితంగా మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి ప్రజల్లో ఆదరణ లేకపోవడంతో మతిభ్రమించి పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని, రాష్ట్రాన్ని ఆరు దశాబ్దాలకుపైగా ఏం వొరగబెట్టిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని తిట్టడం ద్వారా పత్రికల్లో, టీవీల్లో ఎంతో కొంత స్పేస్ దొరుకుతుందనే చిల్లర ఆలోచనతో రేవంత్‌రెడ్డి చిల్లర ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ చరిత్రను ధ్వంసం చేస్తే కేసిఆర్ తెలంగాణలో కొత్త చరిత్రను నిర్మిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే కేసిఆర్ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. ఇంకోసారి కేసిఆర్ కుటుంబ సభ్యుల మీద అవాకులు చెవాకులు పేలితే రేవంత్ రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, వెంటనే భేషరతుగా తెలంగాణ సమాజానికి, కేసిఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నవ తెలంగాణ-సిద్దిపేట : పచ్చగా ఉన్న తెలంగాణలో చిచ్చు పెట్టి అల్లర్లు లేపాలని విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని సిద్దిపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ దరిపల్లి శ్రీను అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ సీఎం నివసించే ప్రగతి భవన్‌ను నక్సలైట్లు కూల్చి వేయాలని, ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన రేవంత్ రెడ్డిపై వెంటనే పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, లేదంటే ప్రజా క్షేత్రంలో శిక్ష తప్పదన్నారు. తెలంగాణలోనే కాదు దేశంలో బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్ రెడ్డి అక్రమ కేసుల గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసులను ఎదుర్కొన్న వ్యక్తి కేటీఆర్ అయితే.. ఉద్యమానికి ద్రోహం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని ధ్వజమెత్తారు. మాజీ సర్పంచ్ పబ్బా పరమేశ్వర్ , నరేష్, అజయ్, సంపత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-మర్కుక్: తన స్వార్థ రాజకీయాల కోసం పాదయాత్ర చేస్తున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కర్ణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మర్కుక్ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజల కోసం తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిషలు పని చేసిన కేసీఆర్‌పై బీఆర్ఎస్ పార్టీపై పిచ్చి ప్రేలపానలు మానుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మర్కుక్ మండల బీసీ సెల్ అధ్యక్షులు మేకల కనకయ్య , సర్పంచ్ లు అచ్చంగారి బాస్కర్ ,ఎర్రబాగు అశోక్, ఆత్మ కమిటి డైరెక్టర్ యవగారి సంతోష్ రెడ్డి , పాములపర్తి బీఆర్ఎస్ అధ్యక్షుడు పిట్ల మహేష్ తదితరులున్నారు.

అసంతృప్తిలో సర్పంచులు

- చర్చనీయాంశంగా మారిన సర్పంచుల రహస్య మంతనాలు
- సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడిపై సర్పంచుల అసహనం
- ఎంపీటీసీలకు సీసీ రోడ్ల పనులివ్వడానికి సర్పంచుల ససేమిరా
- శిలాఫలకంపై పేర్లు చేర్చాలని సర్పంచుల పట్టు

నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు రహస్యంగా మంతనాలు జరపడం బుధవారం చర్చనీయాంశంగా మారింది. సర్పంచులకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించడంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారతదేశ స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాతీయ చిహ్నం నిర్మాణం చేపట్టి ప్రారంభించారు. జాతీయ చిహ్నం శిలాఫలకంపై మండలంలోని సర్పంచుల పేర్లను విస్మరించి ప్రారంభోత్సవం చేయడం సంబంధిత అధికారులు పరోక్షంగా అగౌరవపరచడమేనని సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శిలాఫలకంపై విస్మరించిన పేర్లను చేర్చాలని సర్వసభ్య సమావేశంలో విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్పంచులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. గ్రామాల్లోని సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీటీసీలకు కేటాయించాలని ఒత్తిడికి గురి చేస్తున్నారని సర్పంచులు వాపోతున్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని శిలాఫలకంపై పేర్లు చేర్చి ఎంపీటీసీలకు సముచిత స్థానం కల్పించి, సర్పంచులను విస్మరించడంతోనే ఎంపీటీసీలకు పనులివ్వడానికి ససేమిరానన్నట్టు సర్పంచులు చెబుతున్నారు. పలువురి సర్పంచుల రహస్య మంతనాలపై సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడి వివరణ కొరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. శిలాఫలకం వివాదం చిలికి చిలికి గాలివానై మారకుండా అధికారులు సత్వర చర్యలు చేపడుతారో..? లేక నూతన సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడి ఎన్నిక అనివార్యమవుతుందో? వేచి చూడాలి.

కేసీఆర్ క్రికెట్ టోర్నీ విజేత బంగారం సన్ రైజర్స్ జట్టు



నవతెలంగాణ కొండపాక

ఈ నెల 17న సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల ఎంపీటీసీ పరిధిలోని యువకులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కొండపాక ఎంపీపీ రాగళ్ల సుగుణ దుర్గయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంటులో మూడు గ్రామాల యువకులు పాల్గొన్నారు. 9 క్రికెట్ టీములు పోటీపడగా బందారం సన్ రైజర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో బంగారం సన్రైజర్స్ టీం, అంకిరెడ్డి పల్లె చిల్లీ గ్యాంగ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్ బట్ట నరేష్ , మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గంగుల బాలరాజు లు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎంపీపీ రాగళ్ల సుగుణ దుర్గయ్య ప్రథమ బహుమతిగా పదివేల రూపాయలను, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు అందజేశారు. దర్గా సర్పంచ్ పిడిశెట్టి శ్రీనివాస్ విజేతలకు శీల్డులను ఈ టోర్నమెంట్ కోసం అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుగుణ దుర్గయ్య మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లోని యువత పట్టుదలతో అన్ని రంగాలలో సాధించాలని అన్నారు. క్రీడలు యువతకు మానసిక ఉల్లాసాన్ని శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని మూడు గ్రామాలకు క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ర్యాగళ్ళ దుర్గయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబా గౌడ్, మాజీ సర్పంచ్ బడేకోలు నరసింహులు యాదవ్, ఉపసర్పంచులు బట్ట వెంకటేష్, నర్సింగరావు, రైతుబంధు కోఆర్డినేటర్ యాదమ్ రావు, నాయకులు వెంకటేష్, కిరణ్,పిఎసిఎస్ డైరెక్టర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఫైనల్ మ్యాచ్ సందర్భంగా రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ ర్యాగళ్ళ దుర్గయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబాలు బ్యాటింగ్, బౌలింగ్ చేస్తూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నంగునూరు

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం నంగునూరు మండలంలోని బద్దిపడగ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గర్భకోశ వ్యాధికి సంబంధించిన 31 పశువులను గుర్తించి 8 పశువులకు, దూడలకు చికిత్సలు నిర్వహించారు. నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. పశువులకు సంబంధించిన శాస్త్రీయపరమైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ వేముల కొండల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, విజయ డైరీ చైర్మన్ వేముల శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ డైరీ చైర్మన్ నాయిని సుధాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ రేపాక రాజేందర్,పశుసంవర్ధక శాఖ జాయింట్ డాక్టరు జగత్ కుమార్ రెడ్డి, సహాయ సంచాలకులు సత్యప్రసాద్ రెడ్డి, పశువైద్యాధికారులు డాక్టర్ వేణుగోపాల్, చతుర్వేది, శ్రీనివాస్ సిబ్బంది సదాలక్ష్మీ, నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఫామాయిల్ సాగుకు రైతులు పెద్ద ఎత్తున దృష్టి సారించాలని, ఫామాయిల్ సాగుకు ప్రభుత్వం అందించే సబ్సిడీ రాయితీలు, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక, మిరుదొడ్డి మండలాల ఉద్యాన శాఖ అధికారి ఆర్. బాలాజీ, దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతల జ్యోతి సూచించారు. సిద్దిపేట జిల్లా అక్బరుపేట్ -భూంపల్లి మండలంలోని పోతారెడ్డిపేట గ్రామ రైతు వేదికలో బుధవారం ఫామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక మండలంతో పాటు అక్బరుపేట్ మండలంలో విలీనమైన(దుబ్బాక మండలానికి సంబంధించిన పలు గ్రామాల కలిపి) 320 ఎకరాల్లో ఈ ఫామాయిల్ సాగు జరుగుతుందన్నారు. ఈ సాగులో రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ తో పాటు మార్కెటింగ్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. ఈ పంటలతో పాటు రైతులు అంతర పంటల సాగు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు.రైతులంతా కూడా ఆయిల్ పామ్ సాగుకు పెద్దఎత్తున ఆసక్తి చూపాలన్నారు. ఈ సాగు ద్వారా తెలంగాణ రాష్ట్రంలోనే స్వతహాగా వంట నూనెలు తయారు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోతారెడ్డి పేట ఎంపీటీసీ చంద్రసాగర్ , నగరం సర్పంచ్ , ఏఈవో అనూష, రైతులు ఉన్నారు



కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి







నవతెలంగాణ-చేర్యాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప,వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి కోరారు. చేర్యాల మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో గల రైతు వేదిక భవనంలో బుధవారం కంటి వెలుగు పరీక్షా కేంద్రాన్ని చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి కంటి చూపు ఎంతో అవసరమని, కంటిచూపు లేకపోతే జీవితం అంధకారంగా మారుతుందని అందుకే ప్రతి ఒక్కరికి కంటి చూపు ఉండేలా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. దృష్టిలోపాలను తొలగించేందుకు ప్రతి ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌన్సిలర్లు ఆడపు నరేందర్, మంగోల్ చంటి, యాట కనకవ్వ యాదగిరి, ముస్త్యాల తార యాదగిరి, సందుల సురేష్,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల నర్సయ్య,యూత్ నాలుగు మండలాల ఇంచార్జి శివగారి అంజయ్య, రావుల ఉమేష్, కొట్టె గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్: సర్వేంద్రియాలలో నయనం ప్రధానమైందని మర్కుక్ జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, ఎంపీటీసీల ఫోరం మర్కుక్ మండలాధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని దామరకుంట గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గాయత్రి బాలనర్సయ్య, గజ్వేల్ మార్కెట్ కమిటి డైరెక్టర్ పత్తి బాబు యాదవ్, ఎంపీడీవో ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పత్తి అంజనేయులు యాదవ్, డాక్టర్ల బృందం అశాలత, శ్రీనివాస్, అంగనవాడీ టీచర్లు అంబబాయి, జ్యోతి, ఆశాలు హారిత, స్వప్న, నాయకులు మహేష్, వెంకటేష్, సాయికుమార్ గౌడ్, నర్సింలు తదితరులున్నారు.

నవ తెలంగాణ-దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం మండల పరిధిలోని చెట్ల నర్సంపల్లలో స్థానిక సర్పంచ్ వేమ జనార్ధన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ సంధ్య రవీందర్, జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ లక్ష్మి పోచయ్య, స్థానిక జెడ్పిటిసి రణం జ్యోతి శ్రీనివాస్ గౌడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునే విధంగా యువత ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇంద్ర మోహన్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభునిపల్లిలో తిమ్మప్ప చిత్ర యూనిట్ సందడి

నవతెలంగాణ- దుబ్బాక రూరల్

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లిలో (టీపీ ఫోక్ ఛానల్) తిమ్మప్ప ఫోక్ ఛానల్ చిత్ర యూనిట్ మంగళవారం, బుధవారం సందడి చేసింది. టీపీ ఫోక్ ఛానల్ తిమ్మప్ప ఆధ్వర్యంలో తాగో తాగో అనే జానపద గేయాన్ని (అధ్య శ్రీ మ్యూజిక్ సీఈవో) పద్మనాభునిపల్లి మాజీ సర్పంచ్ ముక్కపల్లి శ్రీనివాస్ ,మాజీ ఉపసర్పంచ్ కండ్లకొయ్య స్వామి చరణ్ కొబ్బరికాయ కొట్టి షఉటింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముక్కపల్లి శ్రీనివాస్,చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ ఈ జానపద గేయాన్ని తిరుపతి జవాను లిరిక్స్ రైటర్ రచించగా...గాయకుడు సాకేత్ ఈ పాటకు తనగానంఅందించారు. ఈ పాటకు కొరియోగ్రాఫీ %డ% డైరెక్టర్ శేఖర్ వైరస్ చేయగా... కెమెరామెన్ అర్జున్ కొల్లుర్ షఉటింగ్ ని చిత్రీకరించారు.కాగా ఈ షఉటింగ్ లో హీరో హీరోయిన్లుగా కార్తీక్ రెడ్డి, శిరిషా నటించగా ... ఆర్ట్ డిపార్ట్మెంట్ చరణ్ ఈవెంట్స్ సెటపులతో చిత్రీకరణ జరిగింది. ఈ విషయం తెలుసుకుని గ్రామస్తులు, యువత పెద్ద ఎత్తున షఉటింగ్ దగ్గరకు చేరుకుని వీక్షించి, ఆనందించారు. ఈ షఉటింగ్ లో ప్రొడ్యూసర్ తిమ్మప్ప, సహాయ నటులు భవిత, మానస, దివ్యప్రవీణ్, సిద్దు తదితరులు ఉన్నారు



